







మాట తప్పాడు.. మడమ తిప్పాడు.. నాడు హామీలిచ్చాడు.. అమలు చేయలేకపోయాడు.. అడిగితే అధికారంతో అణగదొక్కేశాడు.. ఎందుకో తెలియదు కానీ సర్కారు ఉద్యోగులపై పగపట్టాడు.. జగన్ సీఎం పీఠం ఎక్కిన తర్వాత సర్కారీ కొలువుల చరిత్రలోనే మొదటిసారిగా 'జీతాలు పడ్డాయా' అనే మాట పుట్టుకొచ్చింది. అంగన్‌వాడీలకు తాళాలు పడ్డాయి. ఆశాలు కన్నీరు మున్నీరయ్యారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు పెన్‌డౌన్ చేశారు. చిరుద్యోగులు చితికిపోయారు. మునిసిపల్ కార్మికులు రగిలిపోయారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నోసార్లు ప్రభుత్వోద్యోగులు రోడ్డెక్కారు. ఇక టీఏ, డీఏ తదితర బిల్లుల సంగతే లేదు.. జగన్ ప్రభుత్వం బెదిరింపులతో ఐదేళ్లు గడిపేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే జగన్ మాటలన్నీ దగా అని నిరూపితమైంది.

సర్కారు వారి 'పగ'

ఐదేళ్లూ ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి

అమ్మో ఒకటో తేదీ..

ఏ ప్రభుత్వంలోనైనా ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు, పింఛన్లు కోసం ఎదురుచూడడం విన్నారా..!? ఠంఛన్‌గా ఒకటో తేదీనే పడిపోయేవి.. మరి జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాతో ఒకటో తేదీ అనే మాటే మరిచిపోయారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఓపీఎస్ మాట దేవుడెరుగు. ప్రభుత్వోద్యోగులకు అసలు జీతాలు కూడా సమయానికి అందిన దాఖలాలు లేవు. ఎన్నడూ లేనిది జీతం కోసం సమ్మె చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. కాస్త గట్టిగా గళం విప్పిన ఉద్యోగులపై కక్ష సాధింపులకు దిగారు. రకరకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. టీచర్ల పరిస్థితి మరీ దారుణంగా మారింది. నాలుగైదు నెలల పాటు జీతాలు లేక తీవ్రమైన సమస్యలు ఎదుర్కొన్నారు. టీఏ, డీఏ బిల్లుల గురించి అడిగే అవకాశం లేదు. గత ప్రభుత్వంలో.. పోలీసులు ఏదైనా బందోబస్తు విధులపై వెళ్తే అడ్వాన్సు డీఏ అని భోజనం తదితర అవసరాల కోసం కొంత మొత్తం ఇచ్చి పంపేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అసలు ఆ హెడ్(అకౌంట్)నే లేపేసింది. దీంతో బందోబస్తులకు వెళ్లే పోలీసులు టీ నీళ్లకూ నానాయాతన పడేవారు.

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/అమలాపురం రూరల్/ తుని రూరల్/సామర్లకోట/ అమలాపురం రూరల్/ నిడదవోలు/ పెద్దాపురం/ముమ్మిడివరం/ పి.గన్నవరం

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఆకలి కేకలు

మధ్యాహ్నం భోజన పథకం కార్మికులను జగన్ సర్కారు కష్టాలకు గురిచేసింది. ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన రాగి జావ తయారీ, వడ్డింపునూ వాళ్లపైనే రుద్దింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిన భారం ఎండీఎం కార్మికులను ఘోరంగా తిప్పలు పెట్టింది. నాలుగేళ్ల నుంచీ పెరుగుతూ వస్తున్న ధరల వల్ల ప్రభుత్వం చెల్లించే సొమ్ము కంటే పెట్టుబడి ఎక్కువవుతోంది. దీంతో నెలకు బిల్లు చేతికి వచ్చే సరికి అప్పులకు పోగా ఇంకా అప్పులు ఎదురుచూస్తూనే ఉండే పరిస్థితి వచ్చింది. గౌరవ భృతి పెంపు, మెనూ చార్జీల సవరణ వంటివి జగన్ ఎప్పుడూ పట్టించుకోలేదు. పిల్లలకు ఈ ప్రభుత్వం నాణ్యమైన గుడ్లను సరఫరా చేయలేకపోయింది. సన్నబియ్యం ఇవ్వడమూ చేతగాలేదు. ఫోర్టిఫైడ్ రైస్ అంటూ బియ్యంలో వేరొక రకం కలిపి ఇస్తోంది. అధిక శాతం పచ్చిబియ్యం సరఫరా అవుతుండడంతో జగన్ మామయ్యను పిల్లలు తిట్టుకుంటూనే 'గోరంత ముద్ద' తింటున్నారు.

- నాడు అధికారం కోసం అలవికాని హామీలు
- సీఎం పీఠమెక్కిన తరువాత అణిచివేతే లక్ష్యం
- అటకెక్కిన సీపీఎస్ రద్దు హామీ
- ఆశాల ఊసులేదు.. అంగన్‌వాడీల మాటాలేదు
- బిల్లుల చెల్లింపుల్లేవ్.. బెదిరింపులతో పాలన

ఆశా..నిరాశే..

ఆశావర్కర్ల ఆవేదన సర్కారుకి వినపడలేదు. ఎన్నో సార్లు నిరసన తెలిపినా ఆడబిడ్డల కష్టం జగన్‌కి కనిపించలేదు. ఆశలు జాబ్ చార్టులోని పనులతో పాటు ఎన్నో పనులు అదనంగా చేయాల్సి వచ్చేది. దీనికి ప్రభుత్వం ఫోన్ ఇచ్చింది. ఆ ఫోన్‌లో 8 రకాల పనులు అప్‌లోడ్ చేయాల్సి వచ్చేది. నాణ్యమైన ఫోన్ కాకపోవడం పైగా 2జీ నెట్ కావడంతో ఆశాలు ప్రతిరోజూ నరకం చూసేవారు. ఆశావర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రెండేళ్ల నుంచీ తీసేశారు. ఆశాలకు కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు లేవు. పీఎఫ్, ఈఎస్ఐ, మెటర్నిటీ, మెడికల్ లీవుల సదుపాయం లేనేలేదు. ముఖ్యంగా కొవిడ్‌కాలంలో చనిపోయిన ఆశావర్కర్ల కుటుంబీలకు ఉద్యోగాలు ఇవ్వడానికి కూడా జగన్‌కి చేతులు రాలేదు.

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం..

సుమారు 50 రోజులు అంగన్‌వాడీలు ఎండనక.. వాననక ఆందోళన చేశారు.. ఏదో ఒకటి సాధించాలని భీష్మించారు. అయితే జగన్ ప్రభుత్వం ఊరుకుంటుందా.. ఆందోళన చేస్తే ఉద్యోగం పీకేస్తామని భయపెట్టింది.. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు ప్రభుత్వోద్యోగులతో బద్దలు కొట్టించి ప్రభుత్వమే తాళాలు వేయించడం బహుశా చరిత్రలో జగన్ జమానాలోనే తొలిసారి చూశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక కేవలం రూ.వెయ్యి మాత్రమే వేతనం పెంచారు. తెలంగాణలో మాదిరిగా జీతం ఇస్తామనే మాటను జగన్ తప్పారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, 2022 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. కొన్ని రాష్ట్రాలు అమలు చేసినా జగన్ మాత్రం పట్టించుకోలేదు.




టీచర్ల నిరసన

గురువులను రోడ్డెక్కించారు..

అధికారంలోకి వస్తే వారంరోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని ప్రతిపక్షనేతగా జగన్ ఐదేళ్ల కిందట పాదయాత్రలో హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత మడమ తిప్పారు. సీపీఎస్ రద్దు చేయలేమని ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని, దానికంటే మెరుగైన జీపీఎస్ ఇస్తామని మాట మార్చారు. సీపీఎస్ విధానం రద్దుకు రాష్ట్రంలో ఉద్యోగులు తెలపని నిరసన లేదు. చేయని ఆందోళన లేదు. సీపీఎస్‌పై సమరభేరి మోగించి సమస్యను వివిధ రూపాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేశారు. ఇచ్చిన హామీ పక్కన పెట్టిన జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాని కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీనికి వ్యతిరేకంగా ప్రశ్నించిన వారి గొంతు నొక్కాలని, ఆందోళనను అణచివేయాలని ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించినా, అరెస్ట్ చేసినా ఉద్యోగులు ముక్తకంఠంతో నినదిస్తూనే ఉన్నారు.

ఉద్యోగులకు సమగ్ర 'శిక్ష'

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'సమగ్ర శిక్ష' ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనాల వెతలు శ్రుతి మించిపోవడంతో సిబ్బంది పెన్‌డౌన్ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 414 మంది ఉద్యోగులు ఉండగా వారికి నెలకు రూ.85లక్షల జీతాలు కూడా జగన్ చెల్లించలేకపోయేవారు. కేంద్ర ప్రభుత్వ వాటానూ రాష్ట్ర ప్రభుత్వం దిగమింగేది.

జీతమూ లేదు.. పర్మినెంటూ లేదు..



గోదావరి సెంట్రల్ డెల్టా సిస్టమ్‌లో ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి 611 మంది ఇరిగేషన్ శాఖలో లస్కర్లుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరితో జూన్ 1 నుంచి మార్చి 31 వరకూ పనిచేయించుకుంటున్నారు. నెలకు రూ.10,500 జీతంగా మాత్రమే ఇస్తున్నారు. లస్కర్ల సంఘం తరపున గత మూడేళ్లలో రెండు సార్లు సీఎం జగన్‌ను కలిసి రెగ్యులర్ చేయాలని వేడుకున్నాం. లస్కర్లను ఆప్కాస్‌లో చేరుస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చ లేదు. ప్రస్తుతం పన్నెండు నెలల జీతాల బకాయిలు అందించాల్సి ఉంది. - ఉండపల్లి సూర్యచంద్ర, లస్కర్ల సంఘం అధ్యక్షుడు

సీపీఎస్ రద్దుకు వారమన్నారు..ఐదేళ్లయింది?



వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన వారంలోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని జగన్ హామీ ఇచ్చి అమలు చేయకపోవడం నష్టం కలిగిస్తోంది. పదకొండో పీఆర్సీ ఇస్తానని చెప్పి రివర్స్ పీఆర్సీ ఇవ్వడం న్యాయమా. ఎనిమిది డీఏ బకాయిలు, ఎరియర్స్ చెల్లించకపోవడం దారుణం. వాటి సాధనకు ఉద్యమిస్తే అణచివేయడం దుర్మార్గం. పి.హిమబిందు, ఎస్టీయూ మండల అధ్యక్షురాలు, ముమ్మిడివరం

నాడు హామీలతో ఓట్లు దండుకున్నారు..



అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్నారు. కొత్తగా తెరపైకి తెచ్చిన జీపీఎస్‌తో ఉద్యోగులకు నష్టమే తప్ప లాభం లేదు. ఈ విధానంలో ఉద్యోగులు తమ జీతం నుంచి 10 శాతం కంట్రిబ్యూట్ చేయాల్సిందే. ఓపీఎస్ అమలుకు పోరాటం చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం స్పందించట్లేదు. - దూనబోయిన రామకృష్ణ, యూటీఎఫ్ పి.గన్నవరం మండల అధ్యక్షుడు

నాడు అధికారానికి హామీలు.. తర్వాత కొర్రీలు



ఉద్యోగుల స్వేచ్ఛను హరించి ఎందరిపైనో కేసులు పెట్టించారు. సంఘ విద్రోహ శక్తులుగా ముద్రవేసి పోలీసుస్టేషన్ల చుట్టూ తిప్పడంతో ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో మరిచిపోలేరు.కొవిడ్‌లో ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్ద విధులు నిర్వహింపచేసిన తీరు ఏ ఒక్క గురువూ మరిచిపోలేరు. సకాలంలో జీతాలు చెల్లించలేని దుస్థితికి తెచ్చారు. - సరిదే సత్యపల్లంరాజు, ఎస్టీయూ జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి

సీపీఎస్ రద్దు హామీ నెరవేర్చకపోవడం దారుణం



ఉద్యోగుల ఆర్థిక జీవన భద్రతకు గ్యారెంటీ లేని సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి. మా కుటుంబాలు ఆర్థిక ప్రయోజనాలు మాకు ముఖ్యం. ఓపీఎస్‌లో పలు రకాల అడ్వాన్సులు తీసుకునే అవకాశం ఉంది. జీపీఎస్ అనేది అంకెలా గారడీ తప్ప ఏమీ లేదు. - శ్రీనివాస్, తుని మండల యూటీఎఫ్ అధ్యక్షుడు

మాయమాటలు చెప్పి నమ్మించాలనుకున్నారు..



సీపీఎస్ రద్దుకు కేంద్రం ఒప్పుకోలేదని ప్రభుత్వం మాయ మాటలు చెప్పే ప్రయత్నం చేసింది. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేసుకోవడం రాష్ట్రాల స్వయం నిర్ణయాలకు వదిలేస్తున్నామని కేంద్రం కచ్చితంగా చెప్పడంతోనే పలు రాష్ట్రాలు ఈ దిశగా పనిచేస్తున్నాయి. - తాజుద్దీన్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి, కోటనందూరు, కాకినాడ జిల్లా

హామీలిస్తారు.. నెరవేర్చరంతే.


ఉద్యోగులతో జగన్ సెల్ఫీ (ఫైల్)



హామీలిస్తారు.. నెరవేర్చరంతే. జగన్ పాదయాత్రలో వైద్య ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని రెగ్యులరైజ్ చేస్తానని వేతనాలు పెంపుదల చేస్తానని మాట ఇచ్చారు.. అధికారంలోకి వచ్చాక జగన్ మొండి చూపించారు. వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్‌లో 186 కేటగిరీల్లో 22 వేల మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. కరోనా సమయంలో కూడా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సేవలందించారు. 11వ పీఆర్సీలో రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంటీఎస్ ఆమలు చేస్తూ జీవో జారీ చేసింది. కాని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు మాత్రం ఎటువంటి పెంపుదల చేయలేదు. దీనిపై ఉద్యమిస్తే పోలీస్ స్టేషన్‌లో నిర్బంధిం చారు.సీఎం జగన్ హామీ ఇచ్చినా మా సమస్యలు పరిష్కారం కాలేదు. - దిద్దే దయామణి, కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు

అంగన్‌వాడీలకు హామీలిచ్చారంతే..



అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదు. చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చినా జీవో విడుదల కాలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద వర్కర్‌కిరూ.1.20 లక్షలు, హెల్పర్‌కు రూ.60 వేలు ఇస్తామన్నా జీవో విడుదల చేయలేదు. కె.కృష్ణవేణి,అంగన్‌వాడీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి, ముమ్మిడివరం

అంగన్వాడీలను మోసం చేసింది



అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనం చెల్లిస్తామని అంగన్వాడీలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. 11 డిమాండ్లకు ఆరే పరిష్కరించి మేజర్ డిమాండ్లను విస్మరించింది. 42 రోజులు నిరవధిక సమ్మె చేసినా ప్రభుత్వంలో చలనంలేదు. బి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ సంఘ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు

43 రోజులు సమ్మె చేసినా పట్టించుకోలేదు..



పాదయాత్ర సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను జగన్ నెరవేర్చ లేదు. వేతనాల పెంపు జరగలేదు. 43 రోజులు నిరవధిక సమ్మె చేసినా మా ప్రధాన డిమాండ్లకు ఇప్పటికీ మోక్షం కలగలేదు. సమ్మె కాలపు వేతనం తక్షణం చెల్లించాలి. - డి.ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ అధ్యక్షురాలు, రాయవరం సెక్టారు

కాంట్రాక్టు కార్మికులకు టైమ్ స్కేల్ ఇవ్వాలి..



పదేళ్లు పూర్తయిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి మినిమమ్ టైమ్ స్కేల్‌లోకి అమలు చేయాలి. హెల్త్‌స్కీంలు అమలు చేయాలి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మరణిస్తే కుటుం బంలో కారుణ్య నియామక ఉద్యోగాన్ని కల్పించాలి. - సూరిబాబు, రెవెన్యూ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సామర్లకోట

మీరిచ్చే జీజీఎస్ మాకొద్దు..



సీపీఎస్ వారంలో రద్దు చేస్తానన్న జగన్.. లోప భూయిష్టమైన జీపీఎస్ తీసుకొచ్చారు. సమయానికి జీతాలు లేవు. సమస్యలపై పోరాడితే పోలీసులతో అణిచివేతకు గురిచేశారు. పీఎఫ్ లోన్లు, ఏపీజి ఎల్ఐ క్లెయిమ్స్ ఎప్పుడు ఇస్తారో తెలియదు. కొత్త పీఆర్సీలో హెచ్ఆర్ఏ ఎలెవెన్స్ తగ్గించారు. - సతీష్‌బాబు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పి.నాయకంపల్లి, గండేపల్లి

జీతాలు పెంచుతానని ఆశ పెట్టారు..



ఆశా వర్కర్లకు జగన్ ప్రభుత్వం రూ.10వేలు పెంచుతానన్న హామీని పూర్తిగా నెరవేర్చలేదు. రూ.4 వేలు మాత్రమే పెంచారు. చంద్రబాబు హయాంలో ఆశావర్కర్ల జీతాలు రూ.6వేలు ఉండగా జగన్ ప్రభుత్వంలో రూ.10వేలు చేశారు. ఆశావర్కర్ల జీతాలు పెంపుదల చేయాలి. - వెంకటలక్ష్మి, ఆశావర్కర్, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం



మళ్లీ మరమ్మతులకు గురైన గామన్ బ్రిడ్జి

మరోసారి సాంకేతిక లోపం.. నెల రోజుల్లో రెండో సారి

నేటి నుంచి పది రోజుల పాటు ఒక వైపే రాకపోకలు

కొవ్వూరు, ఏప్రిల్ 25: రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుసంధానంగా ఉన్న గామన్ బ్రిడ్జి నెల రోజుల వ్యవధిలో మరోసారి మరమ్మతులకు గురైంది. మార్చి 24న గామన్‌బ్రిడ్జి 52వ స్తంభం వద్ద వంతెనకు యాక్షన్ ఇచ్చే బాల్ మరమ్మతులకు గురి కావడంతో వంతెనపై ఒకవైపు రాకపోకలను నిలుపుదల చేశారు. మరమ్మతులు పూర్తిచేసి సుమారు నెల రోజుల తరువాత ఏప్రిల్ 23న రెండువైపులా వాహన రాకపోకలను అనుమతించారు. అయితే ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో 28వ స్తంభం వద్ద అమర్చిన బేరింగ్‌లో ఎటువంటి ప్రేజర్ రావడం లేదని గుర్తించారు. దీంతో ఈ నెల 26 నుంచి మే 3వ తేదీ వరకు ఈ మార్గంలో వాహన రాకపోకలను నిలుపుదల చేస్తున్నట్టు సమాచారం. బేరింగ్ మార్పు చేయడానికి 10 రోజుల పాటు వంతెనపై ఒక మార్గంలోనే వాహన రాకపోకలకు అనుమతించనున్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో నిర్మించిన వంతెనలు వందేళ్లకు పైగా సేవలందించాయి. ఆధునిక సాంకేతికతతో నిర్మించిన గామన్ వంతెనపై రాకపోకలు ప్రారంభించిన పదేళ్లకే మరమ్మతులకు గురి కావడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు దోచుకున్నదే హద్దుగా నిబంధనలను తుంగలో తొక్కి వంతెనల చెంతనే ఇసుక డ్రెడ్జింగ్ చేసి గోదావరి నదిని గుల్ల చేశారు. గోదావరి తీరం వెంబడి ఏటిగట్టును కొల్లగొట్టి ఏర్పాటుచేసిన ఇసుక ర్యాంపులు, ఇసుక తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు, ఎస్ఈబీ అధికారులు సైతం ఫిర్యాదుచేసిన వారిని, ఇసుక తవ్వకాలు, రవాణా అడ్డుకున్న వారిని అరెస్టులు చేశారు తప్ప ఇసుక అక్రమ తవ్వకాలు, అనధికార డ్రెడ్జింగ్‌ను అరికట్టలేకపోయారు. దీని పర్యవసానమే గామన్‌బ్రిడ్జి మరమ్మతులకు కారణమని గోదావరి జిల్లా వాసులు వాపోతున్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఘట్టం ముగిసింది.ఈ నెల 18న నామినేషన్ల స్వీకరణ మొదలైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి గురువారం వరకూ మొత్తం ఏడు రోజుల పాటు జిల్లాలో పార్లమెంట్,ఏడు అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల ఎన్నికల అధికారులు స్వీకరించారు. శుక్రవారం నామినేషన్లు పరిశీలిస్తారు.29వ తేదీన తుది జాబితా ప్రకటిస్తారు. మధ్యలో ఎవరైనా అప్పీల్ చేసుకోవచ్చు. తమ నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు.మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ఈ నెల 29వ తేదీ సాయంత్రం 3 గంటలకు ప్రకటిస్తారు. చివరిరోజైన గురువారం కూడా నామినేషన్లు జోరుగా దాఖలయ్యాయి. రాజమహేంద్రవరం పార్లమెంట్‌కు 7 నామినేషన్లు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 65 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు.

● రాజమహేంద్రవరం పార్లమెంట్‌కు గురువారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా కొల్లపు వేణు, జల్లి బాల నవీన, గొలుగూరి వెంకటలక్ష్మి నారాయణరెడ్డి, ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ తరపున చేబ్రోలు చైతన్యరిపబ్లిక్ ఆఫ్ ఇండియా తరపున వారా ప్రభాకర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున పులగం విజయభాస్కరలక్ష్మి, యుగ తులసీ పార్టీ తరపున కోటగిరి శ్రీనివాసరావు తమ నామినేషన్లు దాఖలు చేశారు.

● అనపర్తి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తరపున నల్లమల్లి మహాలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు.ఇక స్వతంత్ర అభ్యర్థులుగా కొమ్మరి శారమ్మ, పులగం సూర్రెడ్డి, రేలంగి నాగేశ్వరరావు, రేలంగి ఆసుబాబు, పివివి సత్యనారాయణ, వి.అరవింద్, జైభారత్ పార్టీ తరపున కారిదాస్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా కొమ్మన సత్య ఝాన్సీ, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున షేక్ సర్దార్ హుస్సేన్ నామినేషన్లు దాఖలు చేశారు.


అనపర్తిలో బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

● రాజానగరం నియోజకవర్గం నుంచి రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ తరపున కొత్తపల్లి బాస్కరరామం, వైసీపీ తరపున గంధం రాజేశ్వరి, నారం సూర్యలక్ష్మీ నారాయణ, స్వతంత్ర అభ్యర్థులుగా బర్రె ఆనంద కుమార్, బత్తుల బాలబ్రహ్మం, బత్తుల వందన అంబిక, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున ముండ్రు వెంకట శ్రీనివాస్, జై.భారత్ నేషనల్ పార్టీ తరపున పొనగంటి అప్పల సత్యనారాయణ, ఇండియన్ ప్రజాబంధ్ పార్టీ తరపున మద్దా వెంకట్రావు, బీఎస్పీ తరపున నల్లమిల్లి రవికుమార్, జనసేన తరపున దొడ్డా వెంకటేశ్వర్లు, భారతీయ చైతన్యపార్టీ తరపున కట్టా కృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు.

● రాజమండ్రి అర్బన్ నుంచి వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ తరపున మార్గాని సురేష్, పిరమిడ్ పార్టీ ఇండియా తరపున యనమదల మోహన్‌బాబు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి బోడా వెంకటలక్ష్మి తరపున శిఖా బాలాజీ, భారతీయ చైతన్యపార్టీ తరపున వెలిగట్ల సుబ్రహ్మణ్యం, జైభారత్ నేషనల్ పార్టీ తరపున బహదూర్‌షా కృష్ణచైతన్య నామినేషన్లు దాఖలు చేశారు.

● రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వైసీపీ అభ్యర్థిగా చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తరపున గొందేశి శ్రీనివాసరెడ్డి, బీఎస్పీ తరపున కొండపల్లి సూరిబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా బుద్దపు శివవిష్ణు ప్రసాదరావు, మనీల్ బుచ్చియ్య, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా బాలేపల్లి మురళీ,జైబారత్ పార్టీ తరపున మన్నవ రఘురామ్, జైభీమ్‌రావు పార్టీ తరపున గునిపే కిరణ్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు.

● కొవ్వూరు ఎస్‌సి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు తరపున అనుపిండి చక్రధరరావు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ముప్పిడి సుజాత తరపున ఈదూరి వెంకటరమణ మూర్తి, రాష్ట్రీ ప్రజా కాంగ్రెస్ తరపున కొయ్య శేఖర్ బాబు, బీఎస్పీ తరపున చొల్లా కుమారి, వైసీపీ తరపున తలారి పరంజ్యోతి,నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున ముప్పిడి శేఖరబాబు నామినేషన్లు వేశారు.

● నిడదవోలు నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున గెడ్డం శ్రీనివాసనాయుడు, స్వతంత్ర అభ్యర్థులుగా కంచర్ల దుర్గేష్, గిద్దా శ్రీనివాసనాయుడు, గిద్దా వెంకటేశ్వరరావు, బీఎస్పీ తరపున గుమ్మాపు చిత్రసేను, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున ముక్కామల అన్నవరపు ప్రసాద్, ఎన్‌జేఎస్‌పీ పార్టీ తరపున కొట్టేయాల దుర్గా ప్రసాద్, ఐఎన్‌సీ తరపున పెద్దిరెడ్డి సుబ్బారావు, ఎఐఎఫ్‌బి పార్టీ తరపున కస్తూరి వీర ప్రసాద్ నామినేషన్లు దాఖలు చేశారు

● గోపాలపురం నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున మద్దిపాటి వెంకట్రాజు, జైభారత్ పార్టీ తరపున ములగాల శ్రీనివాసరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున షోడదాసి మార్టిన్ లూథర్, ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ తరపున బాతుల వేణు, నవరంగ కాంగ్రెస్ పార్టీ తరపున మద్దిపాటి వెంకటేశులు నామినేషన్లు దాఖలు చేశారు.

● చివరి రోజు రాజమండ్రి పార్లమెంట్‌కు 7, అనపర్తి అసెంబ్లీ స్థానానికి 17, రాజానగరం అసెంబ్లీకి 13, రాజమండ్రి సిటీకి 5, రాజమండ్రి రూరల్‌కు 8, కొవ్వూరు కు 8, నిడదవోలుకు 8, గోపాలపురం అసెంబ్లీకి 6 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం మొత్తం పార్లమెంట్‌కు ఏడు, అసెంబ్లీ స్థానాలు ఏడింటికి కలిపి 65నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా ఏడు రోజులు పార్లమెంట్‌కు 24 .. అసెంబ్లీకి 181 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

పోలీస్ అబ్జర్వర్ బలరామ్ మీనా

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా, ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి పోలీసులు సమష్టిగా సమన్వయంతో నిబద్ధతగా విధులు నిర్వర్తించాలని పోలీస్ అబ్జర్వర్ బలరామ్ మీనా పేర్కొన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన సమీక్షించారు.

ప్రజలకు అందుబాటులో ఎన్నికల పరిశీలకులు

ధవళేశ్వరం, ఏప్రిల్ 25: తూర్పుగోదావరి జిల్లాకు ఎన్నికల కమిషన్ నియమించినప్రత్యేకపరిశీలకులు ధవళేశ్వరం కాటన్ అతిథి గృహంలో బస చేసి తమ విధులు నిర్వహిస్తారని అలాగే నిర్దిష్ట సమయాల్లోప్రజలకు అందుబాటులో ఉంటారని కలెక్టర్ కె. మాధవీలత తెలిపారు.తమిళనాడుకు చెందిన ఐఏఎస్ అధికారి బాల సుబ్రహ్మణ్యం రాజమహేంద్రవరం పార్లమెంట్, రాజమహేంద్రవరంసిటీ, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం,అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా నియమితులయ్యారన్నారు. ఈయన 89779 35105 నెంబరక్‌లో సంప్రదించాలని సాయంత్రు 4నుంచి 5గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కమల్‌కాంత్ సరోచ్ కొవ్వూరు(ఎస్‌సీ), నిడదవోలు, గోపాలపురం(ఎస్సీ) నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా నియమితులయ్యారని 89779 35105 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఉదయం 9 నుంచి 10గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారి జై.అరవింద్‌ను 89779 35073 ఫోన్ నెంబర్ ద్వారా,అసెంబ్లీ నియోజకవర్గ వ్యయపరిశీలనకు ఐఆర్ఎస్ అధికారి రోహిత్ నగర్‌ను 89779 35074ఫోన్ నెంబర్ ద్వారా, పోలీస్ పరిశీలకులు ఐపీఎస్ అధికారి బలరాం మీనాను 87126 02093 నెంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

కాకినాడ (ఆంధ్రజ్యోతి)

గోదావరిలో గాలాడట్లేదు

ఫ్యాన్‌కు ఉక్కపోత





అసెంబ్లీ ఎన్నికల పోరులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అధికార వైసీపీ తీవ్ర ఉక్కపోతకు గురవుతోంది. కీలకమైన ఎన్నికల సమయంలో దూకుడుగా వెళ్లలేక చతికిలపడుతోంది. అసలుసిసలు పోరుకు ముందే ఎన్నికల రణక్షేత్రంలో కాడెత్తేస్తోంది. టీడీపీ, జనసేన కూటమి స్పీడు తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఎన్ని యాత్రలు చేసినా కూటమి స్పీడును ఫ్యాన్ అందుకోలేకపోతోంది. స్వయాన వైఎస్ జగన్ వచ్చి బస్సు యాత్ర చేపట్టారు. అయినా కూడా పార్టీ స్పీడు అందుకోలేకపోయింది. దీంతో పార్టీ క్యాడర్ నిరుత్సాహపడుతున్నారు. మొత్తానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 'ఫ్యాన్'కు అంత బాలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు..

- అసెంబ్లీ ఎన్నికల పోరులో ఉమ్మడి తూ.గో.జిల్లాలో వైసీపీ ఉక్కిరిబిక్కిరి
- టీడీపీ,జనసేన కూటమి ఎన్నికల ప్రచార స్పీడుతో కుదేలవుతున్న ఫ్యాన్
- గోదావరి జిల్లాను చంద్రబాబు,పవన్ సుడిగాలిగా చుట్టేస్తుండడంతో వణుకు
- అలుపెరగకుండా మండుటెండల్లోను దూసుకుపోతున్న ఇద్దరు అధినేతలు
- వైసీపీ వైఫల్యాలు, సూపర్‌సిక్స్ పథకాలు వివరిస్తుండడంతో కూటమికి ఊపేఊపు
- ఇరువురు అధినేతలు పది నియోజకవర్గాలను చుట్టేయడంతో వైసీపీలో కలవరం
- కూటమికి దీటుగా ప్రచారం చేయలేక, జనంలోకి వెళ్లలేక ఈసురోమంటున్న వైసీపీ
- జిల్లాలో సీఎం జగన్ బస్సు యాత్రకు జన స్పందన కరువవడంతో ఓటమి గుబులు
- స్టార్ క్యాంపెయినర్లు లేక ఈసురోమని ఎన్నికల గడువును ఈడ్చుకొస్తోన్న వైనం



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఒకపక్క టీడీపీ అధినేత చంద్రబాబు, మరోపక్క జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ విడివిడిగా, కలివిడిగా బహిరంగ సభలతో నియోజకవర్గాల్లో హోరెత్తించేస్తున్నారు. వరుసపెట్టి ఊపిరిసలపకుండా గోదావరి జిల్లా కేంద్రంగా సభలు, సమావేశాలతో పార్టీలోను, ప్రజల్లోను ఊపుతెస్తున్నారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా అలుపెరగకుండా పోరాడుతున్నారు. దీంతో ఈ ఇద్దరు అధినేతల పోటీపోటీ ఎన్నికల ప్రచారంతో అధికార వైసీపీకి అసలేమాత్రం ఊపిరాడడం లేదు. కూటమికి దీటుగా జనంలోకి వెళ్లలేక తీవ్ర ఉక్కపోతకు గురవుతోంది. కూటమికి పోటీగా పార్టీ అధినేత జగన్ బస్సు యాత్రతో ఎంతోకొంత ఊపొస్తుందని వైసీపీ అభ్యర్థులు భావించారు. కానీ ఎప్పుడొచ్చారో తెలియదు అన్నట్లు నిరాదరణ మధ్య జగన్ ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో కంగుతిన్నారు. ఒకరకంగా చెప్పాలంటే స్టార్ క్యాంపెయినర్లు లేక, జనంలో ఆదరణ లేక ఉమ్మడి జిల్లాలో ఫ్యాన్ దిక్కులు చూస్తోంది. గోదావరి జిల్లాలో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా పనిచేస్తోన్న కూటమిని ఎదుర్కోలేక బిత్తరపోతోంది.

రోజురోజుకు సడలిపోతున్న ధీమా

అయిదేళ్ల పాలనలో బటన్ నొక్కుడు కారణంగా తిరిగి మళ్లీ గెలుస్తామనే ధీమా క్రమేపీ సడలిపోతోంది. ఎన్నికల్లో డబ్బుమద్యం విచ్చలవిడిగా పంచైనా ఎదురులేకుండా చేసుకోవాలన్న అంచనాలు పటాపంచలవుతుండడంతో వైసీపీ నేతలు దిగులు చెందుతున్నారు. వాస్తవానికి గడిచిన రెండు నెలల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను చంద్రబాబు,పవన్ సుడిగాలిలా చుట్టేశారు. వరుస సభలు,సమావేశాలు,రోడ్డుషోలతో హోరెత్తించేశారు. ప్రధానంగా టీడీపీ అధినేత చంద్రబాబు వయస్సును కూడా లెక్క చేయకుండా అనేక నియోజకవర్గాలను చుట్టేశారు. తునిలో రా కదలి రా సభ నుంచి జగ్గంపేట, కొత్తపేట, రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో సభల్లో పాల్గొన్నారు. అటు పవన్ కల్యాణ్ సైతం పిఠాపురం, కాకినాడ, రాజానగరం నియోజకవర్గాల్లో పర్యటించి కూటమి గ్రాఫ్ అమాంతం పెంచేశారు.చంద్రబాబు,పవన్ ఇద్దరు కలిసి గన్నవరం, అమలాపురం నియోజకవర్గాల్లో ఉమ్మడిగా కలిసి సభలు నిర్వహించి వైసీపీకి ఓటమి భయం ముందే చూపించారు. వీరిద్దరి సభలతో కోనసీమ జిల్లా హోరెత్తింది. ఇలా ఇద్దరు అధినేతలు కలిసి వరుసగా గోదావరి జిల్లా కేంద్రంగా సుడిగాలిలా చుట్టేస్తుండడంతో వైసీపీకి ఏం పాలుపోవడం లేదు. వాస్తవానికి పవన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా ఈ ఎన్నికల్లో పావులు కదపడంతో వైసీపీ ముందు నుంచీ కలవరపడుతోంది. సామాజికంగా పట్టున్న జిల్లా కావడంతో ఆయన ప్రభావంతో సీట్లు చాలావరకు కోల్పోతామని ముందునుంచీ అంచనా వేస్తోంది. దానికి తగ్గట్లు పిఠాపురం నుంచి పవన్ ఎన్నికల బరిలోకి దిగడంతో వైసీపీ భయం ఇంకా పెరిగిపోయింది. ఆ ప్రభావంతో కాకినాడ పార్లమెంట్ మొత్తం తుడిచి పెట్టుకుపోవడం ఖాయం అని ఆందోళన చెందుతోంది. సీట్ల పంపకాల్లో కూటమి పార్టీలు గొడవలు లేకుండా కలిసి వెళ్లడం కూడా వైసీపీకి జీర్ణించుకోలేని పరిస్థితి తెచ్చిపెట్టింది. అటు కాపు సామాజిక వర్గం ఓట్లు మళ్లినా ఇతర బీసీ ఓట్లయినా తమకు ఎంతోకొంత దిక్కవుతాయని వైసీపీ అంచనా వేసుకున్నా టీడీపీ,జనసేన కూటమి ప్రభావంతో ఏ సామాజికవర్గ ఓట్లు ఇతమిద్ధంగా తమ ఖాతాలో పడతాయనేది వైసీపీ అంచనా కూడా వేసుకోలేకపోతోంది.

ఆయన పర్యటనతో గాలిపోయింది...

వైసీపీ అధినేత జగన్ బస్సుయాత్ర ఉమ్మడి జిల్లాలోకి అడుగుపెట్టడంతో ఎంతోకొంత మైలేజీ పార్టీకి పెరుగుతుందని వైసీపీ పెద్దలు, ఇతర నేతలు భావించారు. కానీ ఫలితం ఉల్టా అవడంతో అంతా నెత్తీనోరు బాదుకుంటు న్నారు. ఉమ్మడి జిల్లాలో ఆ చివరన రావులపాలెం నుంచి ఈ చివర తుని వరకు జగన్ బస్సు యాత్ర జనం లేక చప్పగా సాగింది. ఉమ్మడి జిల్లా మొత్తానికి కాకినాడలో సిద్ధం సభ నిర్వహిస్తే జనం మధ్యలోనే వెళ్లిపోయారు. చంద్రబాబు, పవన్ దూకుడుకు విరుగుడుగా జగన్ బస్సుయాత్ర పనిచేస్తుందనుకుంటే అదికాస్తా విఫలమవడంతో వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల తేదీ లోపు చంద్రబాబు, పవన్ ఇంకొన్ని నియోజకవర్గాల్లో సభలు, రోడ్డుషోలకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విడిగాను, కలిసి మరికొన్ని రౌండ్లు సుడిగాలిలా చుట్టేయనున్నారు. పవన్ కల్యాణ్‌కు సంబంధించి అప్పుడే షెడ్యూల్ కూడా విడుదలైంది. ఈనెల 26న రాజోలు, రామచంద్రపురం, 27న పెద్దాపురం, కాకినాడ రూరల్, 28న జగ్గంపేట,ప్రత్తిపాడు, మే 4న తుని, పిఠాపురం, 10న పిఠాపురంలో రోడ్డుషో, 11న కాకినాడ సిటీ నియోజకవర్గంలో రోడ్డుషో, బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సమావేశాలతో ఉమ్మడి జిల్లాలో అటు చంద్రబాబు సైతం నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు,పవన్‌స్టార్ క్యాంపెనర్లుగా కూటమిని విజయతీరాలవైపు నడిపిస్తుండడంతో వైసీపీకి బేలగా మారింది. అసలే తీవ్ర ప్రజావ్యతిరేకతతో ఓటమి అంచున ఉన్న పార్టీకి వీరిద్దరి స్పీడుతో అసలేమాత్రం గాలి ఆడడం లేదు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నమోదైన మొత్తం నామినేషన్ల సంఖ్య ఇలా ఉంది..

నామినేషన్ కౌంటర్ (7 రోజులు)

ఎంపీ/ఎమ్మెల్యే నియోజకర్గాలు	మొత్తం
కాకినాడ ఎంపీ	32
1. కాకినాడ సిటీ	32
2. కాకినాడ రూరల్	26
3. పెద్దాపురం	16
4. ప్రత్తిపాడు	23
5. తుని	22
6. పిఠాపురం	28
7. జగ్గంపేట	23
మొత్తం	202
రాజమహేంద్రవరం ఎంపీ	19
1. రాజమహేంద్రవరం సిటీ	13
2. రాజమహేంద్రవరం రూరల్	14
3. అనపర్తి	24
4. రాజానగరం	18
5. కొవ్వూరు	14
6. నిడదవోలు	16
7. గోపాలపురం	15
మొత్తం	133
అమలాపురం ఎంపీ	21
1. అమలాపురం	35
2. రాజోలు	18
3. ముమ్మిడివరం	29
4. పి.గన్నవరం	19
5. కొత్తపేట	24
6. రామచంద్రపురం	28
7. మండపేట	21
మొత్తం	195
1. రంపచోడవరం	26

ఇదో 'రాజకీయం'

ప్రధాన పార్టీల అభ్యర్థులను పోలిన పేర్లతో

పలువురు నామినేషన్లు

తలలు పట్టుకుంటున్న నేతలు

ఇద్దరు తంగెళ్ల శ్రీనివాసులు

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 25: కాకినాడ లోక్‌సభ స్థానానికి ఒకే పేరు కలిగి ఉండే ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయడం కొంత విచిత్రంగా కనిపిస్తోంది. ఇది అనుకోకుండా జరిగిందా లేక ఒక వ్యూహం ప్రకారం చేశారా అనే అంశంపై చర్చ జరుగుతోంది. జనసేన పార్టీ తరపున కాకినాడ లోక్‌సభ స్థానానికి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇదే లోక్‌సభ స్థానానికి చేబ్రోలు గ్రామానికి చెందిన తంగెళ్ల శ్రీనివాస్ అనే వ్యక్తి జాతీయ జనసేన పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఇంచుమించుగా ఒకే పేరు కలిగిన వ్యక్తులు నామినేషన్ దాఖలు చేయడంతో తీవ్ర చర్చనీయాంశమైంది. ఓటర్లు గుర్తులపైనే ఎక్కువగా దృష్టిని కేంద్రీకరించే అవకాశం ఉన్నందున రెండు పేర్లు ఒకేలా ఉన్నంత మాత్రనా ఎలాంటి ఇబ్బందులు ఉండవని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ముగ్గురు గిడ్డి సత్యనారాయణలు

పి.గన్నవరం, ఏప్రిల్ 25: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఒకే పేరుతో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అం దించారు. గిడ్డి సత్యనారాయణ (జనసేన పార్టీ), ఐ.పోలవరానికి చెందిన గిడ్డి సత్యనారాయణ (జాతీయ జనసేన పార్టీ), కాట్రేనికోన మండలానికి చెందిన గిడ్డి సత్యనారాయణ (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ) తరపున నామినేషన్లు దాఖలు చేశారు.

'గొల్లప్రోలు' వైసీపీలో విభేదాలు

సునీల్ నామినేషన్ కార్యక్రమానికి డుమ్మా

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 25: 'ఇతర ప్రాంతాల నాయకులు, ప్రజాబలం లేని నాయకులు వచ్చి మాపై పెత్తనం చేయడం ఏమిటి?, ఇక్కడ ఉన్న వారు ఎవ్వరు పనిచేయరా' అంటూ గొల్లప్రోలు మండలానికి చెందిన వైసీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరంతా గురువారం జరిగిన వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ నామినేషన్ కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. కొంతకాలంగా వీరంతా సునీల్ వ్యవహారశైలిపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. మండలానికి చెందిన నాయకులు ఎవ్వరిని పట్టించుకోకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఇక్కడ పెత్తనం బాధ్యతలు అప్పగించడంతో వారు ఆగ్రహంతో ఉన్నారు. దీంతో నామినేషన్ కార్యక్రమానికి వైసీపీకి చెందిన గొల్లప్రోలు జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు, వైసీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, ఎంపీపీ అచ్చియ్యమ్మ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కాలేదు. అలాగే మండలానికి చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు నామినేషన్‌కు దూరంగా ఉండిపోయారు. ప్రజాబలం లేని, పైరవీలు చేసే నేతలు, ఇతర ప్రాంతాలు వారు వచ్చి తమ మీద పెత్తనం చేస్తామంటే సహించేది లేదని వైసీపీ నేతలు చెబుతున్నారు. వైసీపీలో కొంతకాలంగా కొనసాగుతున్న అసంతృప్తి సునీల్ నామినేషన్ సమయానికి బయటకు వచ్చిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ వ్యవహారం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

పోలింగ్ ఏజెంట్లు కీలకం..

పెద్దాపురం, ఏప్రిల్ 25 : పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరపున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా లేదా అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా ఓటేయడానికి వచ్చిన వారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన రిజిస్టర్ పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థుల తరపున ప్రాధాన్యత క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతీ కదలిక ఏజెంట్ పరిశీలించాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అభ్యర్థులకు నమ్మకమైన వ్యక్తి మాత్రమే ఏజెంట్‌గా ఉంటారు. ఎందుకంటే అతను ఏమాత్రం తప్పు చేసినా ఆ పార్టీకి నష్టమే.


విశేషాలు విశిష్టతల మణిహారం 'ప్రత్తిపాడు'

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం సత్యదేవుని ఆలయం.. అతిపెద్ద వివేకానందుని విగ్రహం, ఆంధ్రా శబరిమల, మైమరిపించే జలపాతాలు, ముచ్చటగొలిపే ఇరిగేషన్ ప్రాజెక్టులు.. ఇలా విభిన్న కలయికల మేళవింపు ప్రత్తిపాడు నియోజకవర్గం.. తియ్యని బెల్లాన్ని అందించే ఏర్రవరం మార్కెట్, ఏజెన్సీ ముఖ ద్వారంగా నిలిచే ఏలేశ్వరం పట్టణం. పలు గిరిజన గ్రామాలు నియోజకవర్గానికి ప్రత్యేక ఆకర్షణ.

• ప్రత్తిపాడు



ఆధ్యాత్మికం, ఆహ్లాదం, ఆశ్రమం




ప్రత్తిపాడు నియోజకవర్గం పుణ్యక్షేత్రాలకు, ఆధ్యాత్మిక కేంద్రాలు, ప్రకృతి జలపాతాలకు నిలయం. రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒక్కటిగా ఉన్న అన్నవరం ఈ నియోజకవర్గంలోనే ఉంది. ఆంధ్ర శబరిమలైగా గుర్తింపు పొందిన ఆలయం కొలువై ఉంది. 108 కోట్ల శ్రీరామనామాలతో శ్రీరామనామ క్షేత్రంగా రామాలయం, కృష్ణుడు, ఆంజనేయ విగ్రహాల నిర్మాణాలతో ఆంధ్రా భద్రాద్రిగా ప్రత్తిపాడు శ్రీరామనామ క్షేత్రం గుర్తింపు పొందింది. అలాగే ఆంధ్ర అరుణాచలంగా రాచపల్లిలోని అరుణాచల స్వామి క్షేత్రం ప్రాముఖ్యతను సంతరించుకుంది. సర్వమత ప్రార్థనాలయంగా 150 ఎకరాల విస్తీర్ణంలో ఓంకార స్వామి స్థాపించిన తోటపల్లి శాంతి ఆశ్రమం ప్రశాంతతకు ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు. రాచపల్లి రమణ సేవాశ్రమం, ఎరకంపాలెం ఆశ్రమాలు సందర్శకులకు, ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. అలాగే ధారపల్లి, తోటపల్లి, ఎరకంపాలెం కొండలు, మల్లికార్జున లొద్దు వంటి ప్రదేశాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఇవి కాకుండా ఏలేరు రిజర్వాయర్, సుబ్బారెడ్డి సాగర్, చంద్రబాబు సాగర్, పంపా రిజర్వాయర్ వంటి ప్రాజెక్టులు ఈ నియోజకవర్గంలోనే నిర్మితమై వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయి. ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖకు వెళ్లే ఏలేరు ఎడవ కాలువ, గోదావరి నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లే పోలవరం కాలువ, పురుషోత్తంపట్నం నుంచి తుని వరకు వెళ్లే పుష్కర ఎత్తిపోతల కాలువలు నియోజకవర్గంలో ఏర్పాటయ్యాయి. చెన్నై- కోల్‌కతా 16వ నెంబరు జాతీయ రహదారి నియోజకవర్గంలో 26 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. కత్తిపూడి నుంచి కృష్ణాజిల్లా దాకపర్రు వరకు 216వ నెంబరు జాతీయ రహదారి విస్తరించి ఉంది. రెండు జాతీయ రహదారులు కలిగిన నియోజకవర్గంగా ప్రత్తిపాడు ప్రత్యేకత సంతరించుకుంది. ఏలేశ్వరం ఏజెన్సీ ప్రాంతానికి ముఖ ద్వారంగా ఉంది.

సంవత్సరం	విజేత	ప్రత్యర్థి
1955	పర్వత గుర్రాజు(కాంగ్రెస్)	ఇనుముల వెంకన్నదొర(స్వతంత్ర)
1962	ముద్రగడ వీర్రాఘవరావు(స్వతంత్ర)	పర్వత గుర్రాజు(కాంగ్రెస్)
1967	ముద్రగడ వీర్రాఘవరావు(స్వతంత్ర)	వరుపుల జోగిరాజు(కాంగ్రెస్)
1972	వరుపుల జోగిరాజు(కాంగ్రెస్)	ముద్రగడ వీర్రాఘవరావు(స్వతంత్ర)
1978	ముద్రగడ పద్మనాభం(జనతాపార్టీ)	వరుపుల అప్పలరాజు (కాంగ్రెస్)
1983	ముద్రగడ పద్మనాభం(స్వతంత్ర)	వరుపుల సుబ్బారావు(కాంగ్రెస్)
1985	ముద్రగడ పద్మనాభం(టీడీపీ)	ఎస్ఎస్ రామ్‌కుమార్(కాంగ్రెస్)
1989	ముద్రగడ పద్మనాభం(కాంగ్రెస్)	వరుపుల సుబ్బారావు(టీడీపీ)
1994	పర్వత సుబ్బారావు(టీడీపీ)	ముద్రగడ పద్మనాభం(కాంగ్రెస్)
1999	పర్వత బాపనమ్మ(టీడీపీ)	వరుపుల సుబ్బారావు(కాంగ్రెస్)
2004	వరుపుల సుబ్బారావు (కాంగ్రెస్)	పర్వత బాపనమ్మ(టీడీపీ)
2009	పర్వత చిట్టిబాబు(టీడీపీ)	వరుపుల సుబ్బారావు(కాంగ్రెస్)
2014	వరుపుల సుబ్బారావు(వైసీపీ)	పర్వత చిట్టిబాబు)(టీడీపీ)
2019	పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్(వైసీపీ)	వరుపుల రాజా(టీడీపీ)

ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో బీసీ ఓటర్లు అధికంగా ఉండటంతో ప్రతి ఎన్నికల్లోను బీసీ ఓటర్లే కీలకమవుతున్నారు. బీసీలు 50శాతం వరకు ఉండటంతో ఎన్నికల్లో వారు ఏ పార్టీకి పని చేస్తే ఆ పార్టీ గెలుపొందడం ఖాయమవుతుంది. ఈ పరిస్థితుల్లో బీసీలకే ప్రధాన పార్టీలు సీట్లు ఇవ్వాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా వినబడుతున్నా ప్రధాన పార్టీల టిక్కెట్లు బీసీలకు లభించడం లేదు. నియోజకవర్గంలో పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో 227 పోలింగ్‌స్టేషన్ల పరిధిలో 1,05,412 మంది పురుషులు ఉండగా 1,08,207 మంది మహిళలు, ఇతరులు 20 మంది ఉన్నారు.





3 కుటుంబాలదే హవా

ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు మూడు కుటుంబాలు చుట్టూనే తిరుగుతాయి. ముద్రగడ, పర్వత, వరుపుల కుటుంబాల వారే ఈ నియోజవర్గానికి ఇప్పటివరకు ఎమ్మెల్యేలుగా ప్రాతినిథ్యం వహించారు. 1955లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో ఇప్పటికి 14 విడతలు ఎన్నికలు జరగగా వాటిలో ముద్రగడ కుటుంబానికి చెందిన ముద్రగడ వీర్రాఘవరావు 2సార్లు, ఆయన తనయుడు ముద్రగడ పద్మనాభం 4 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అలాగే పర్వత కుటుంబీకులు 5సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నియోజకవర్గానికి తొలిసారి జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే పర్వత గుర్రాజు గెలుపొందారు. పర్వత సుబ్బారావు, ఆయన భార్య పర్వత బాపనమ్మ, పర్వత చిట్టిబాబు, పర్వత శ్రీ పూర్ణచంద్రప్రసాద్‌లు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వరుపుల కుటుంబానికి ఈ నియోజకవర్గంలో 3 సార్లు ఎమ్మెల్యే పదవి వరించగా ఒక విడత వరుపుల జోగిరాజు, రెండు విడతలు వరుపుల సుబ్బారావు ఎమ్మెల్యేలయ్యారు. పార్టీల పరంగా చూసుకుంటే 4 విడతలు కాంగ్రెస్, 4 విడతలు టీడీపీ, 2 విడతలు వైసీపీ, 1 విడత జనతా పార్టీ, రెండు విడతలు ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలుపొందారు. భార్యాభర్తలు ఇరువురు 1994-1999 ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా కొనసాగిన రికార్డు ఈ నియోజకవర్గానికి ఉంది. పర్వత సుబ్బారావు, పర్వత బాపనమ్మ ఎమ్మెల్యేలుగా పనిచేశారు.



అభివృద్ధికి దూరంగా

గిరిజన గ్రామాలు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో సబ్‌ప్లాన్ ఏజెన్సీకి చెందిన 56 గిరిజన గూడెం ఉన్నాయి. గిరిజన గ్రామాల్లో 15 వేల మంది పైబడి గిరిజనులు నివసిస్తున్నారు. ఈ సబ్‌ప్లాన్ ఏజెన్సీ రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో చేర్చకపోవడం,ఈ ప్రాంతాన్ని షెడ్యూల్ ఏరియాగా ప్రకటించకపోవడం వల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారు. 56 గిరిజన గ్రామాలను కలిపి పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక గిరిజన మండలంగా ఏర్పాటు చేయాలని వారు ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకున్న వారు లేరు. అలాగే ఏలేరు ఎడమ కాలువ నీటిని నియోజకవర్గానికి మళ్లించాలని తాండవ రిజర్వాయర్ ఏలేరు కాలువల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని పుష్కర ఎత్తిపోతల పథకంలో నియోజకవర్గంలో 23వేల ఎకరాల పొలాలకు సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని ఇక్కడ రైతులు ఎప్పటినుంచో కోరుతున్నారు. ఏలేరు రిజర్వాయర్ సుబ్బారెడ్డిసాగర్, చంద్రబాబు సాగర్ ఆయకట్టు ఆధునీకరించాలని నియోజకవర్గం రైతులు కోరుతున్నారు.



మనిషికి రూ.200

బైకుల్లో పెట్రోల్..బిర్యానీ ప్యాకెట్లు

చలమలశెట్టి సునీల్ నామినేషన్‌కు జనాలను తరలించేందుకు పాట్లు



నామినేషన్‌కు వెళుతున్న సునీల్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 25: కాకినాడ లోక్‌సభ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్ గురువారం నామినేషన్ వేశారు. కాకినాడ నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి వచ్చిన వారికి ఒక్కొక్కరికి రూ.200 ఇచ్చినట్లు ముమ్మరంగా ప్రచారం జరిగింది. పైగా యువత బైక్‌ల్లో పెట్రోల్ పోయించి ర్యాలీకి తీసుకెళ్లినట్లు గుసగుసలు వినిపించాయి. నామినేషన్ క్రతువు ముగిసిన తర్వాత జనానికి ఆహార పొట్లాలు ఇచ్చినట్లు చెప్తున్నారు. తాయిలాలు ఇస్తే గానీ జనం నామినేషన్ కార్యక్రమానికి వచ్చే పరిస్థితి లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎండలు ఎక్కువగా ఉండడంతో ర్యాలీకి వచ్చిన జనం మజ్జిగ, వాటర్ ప్యాకెట్ల కోసం ఎగబడ్డారు. దీంతో ర్యాలీలో కొంత గందరగోళం పరిస్థితి నెలకొంది.

వైసీపీ కార్యకర్తల అత్యుత్సాహం

దవులూరి దొరబాబు నామినేషన్‌లో సామాన్యులకు ఇక్కట్లు

కార్యకర్తల అతితో స్తంభించిన ట్రాఫిక్

ప్రేక్షక పాత్ర పోషించిన పోలీసులు



స్తంభించిన ట్రాఫిక్

పెద్దాపురం, ఏప్రిల్ 22 : వైసీపీ అభ్యర్థి దవులూరి దొరబాబు గురువారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆయన తన సతీమణి చంద్రకళతో కలిసి ఆర్డీవో కార్యాలయానికి భారీ ర్యాలీగా వచ్చి రిటర్నింగ్ అధికారికి జె.సీతారామారావుకు నామినేషన్ పత్రాలను అందచేశారు. దొరబాబు నామినేషన్ దాఖలు కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో సామాన్య ప్రజలు అవస్థలు పడాల్సి వచ్చింది. ట్రాఫిక్ సైతం నిలిచిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఎదుట భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పైగా అక్కడే ఉన్న పోలీసులు అవేమీ పట్టనట్లు వ్యవహరించారు. కనీసం ట్రాఫిక్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేయలేదు. టీడీపీ అభ్యర్థి నామినేషన్ సమయంలో రూల్స్ మాట్లాడిన పోలీసులు వైసీపీ అభ్యర్థి నామినేషన్ సమయంలో ఏమీపట్టనట్లు వ్యవహరించడంపై వారి తీరుపై ప్రజలు పలు విమర్శలు గుప్పించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఆవరణలో ట్రైనీ డీఎస్పీ పాత్రికేయులతో ప్రవర్తించిన తీరు పలు విమర్శలకు దారితీసింది. గుంపుగా వైసీపీ నాయకులు లోపలికి వచ్చినా నిలువరించలేకపోయిన ఆయన పాత్రికేయులను ఫొటోలు తీయద్దు అంటూ నిలువరించే ప్రయత్నం చేయడంతో పాటు కొంత అతిగా ప్రవర్తించారు.

బీజేపీ అభ్యర్థిగా 'నల్లమిల్లి' నామినేషన్

అనపర్తి, ఏప్రిల్ 25 : అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అనపర్తి ఆర్వో కార్యాలయంలో ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురికి నామినేషన్ పత్రాలను అందజేశారు ఆయన వెంట మాజీ మంత్రులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కేఎస్ జవహర్, టీడీపీ జోన్ 2 అధ్యక్షుడు సుజయ్ కృష్ణరంగారావు, ఆళ్ళ గోవిందు తదితరులున్నారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రహిత పాలన కోసం ఎన్డీయే కూటమిగా ఏర్పడిందని భారీ విజయం సాధించడం ఖాయమని నరేంద్రమోదీ మూడో సారి ప్రధాన మంత్రి కావడం ఖాయమని అన్నారు. రామవరంలోని ఆయన స్వగృహం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ మహేంద్రవాడ పొలమూరు గ్రామాల మీదుగా అనపర్తికి చేరుకుంది. సుమారు పదివేల మంది టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు తరలిరావడంతో కోలాహలం సంతరించుకుంది. దారి పొడవునా మహిళలు నల్లమిల్లికి ఘన స్వాగతం పలికారు.



ర్యాలీగా నామినేషన్‌కు వెళుతున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పంతాలకు పోతే శాంతిభద్రతలకు విఘాతం

పేపర్ మిల్లు కార్మిక సంఘం నేతలతో కలెక్టర్, ఎస్పీ భేటీ

తెరుచుకున్న కర్మాగారం ● కార్యకలాపాలు ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25: జిల్లాలో ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించమని, పంతాలకు పోతే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత, ఎస్పీ జగదీశ్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇరువర్గాలు సంయమనంతో ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో సమ్మె నిర్ణయం అలాగే యాజమాన్యం లాకౌట్ ప్రకటనకు సంబంధించి బాధ్యులపై బైండోవర్ కేసులు నమోదుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. సమ్మె విరమణ, లాక్‌డౌన్ ఎత్తివేతపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. 20-25 రోజుల్లో పేపరుమిల్లు కార్యకలాపాలు, ఉత్పత్తి యథాస్థితికి చేరుకున్న వెంటనే కార్మిక సంఘాలతో వారి డిమాండ్ల పరిష్కారం కోసం యాజమాన్యం బేషరతుగా చర్చలకు పిలిచి నివేదిక అందజేయాలని ఆదేశించారు. కార్మికులు కూడా కంపెనీ ఉత్పత్తి సాధారణ స్థాయికి చేరుకునేలా తోడ్పాటు అందచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కఠినంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. మిల్లు యాజమాన్యం లాకౌట్ ను ఎత్తివేయాలని, కార్మికులు విధులకు హాజరు కావాలని కోరారు. జాయింట్ కార్మిక కమిషనర్ ఏ.రాణి మాట్లాడుతూ పేపరుమిల్లు ఉత్పత్తి యథాస్థితికి చేరుకున్నాక కార్మికుల డిమాండ్లపై చర్చలకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సహాయ లేబర్ కమిషనర్ ఏఎస్ఎల్ వల్లీ, డీఎస్పీ రామకృష్ణ, యాజమాన్య ప్రతినిధులు వి.శ్రీనివాస్, జి.గణేష్, ఎస్.విజయకుమార్, కార్మిక సంఘం ప్రతినిధులు, సీఐటీయూ నాయకులు టి.అరుణ్, ఎస్.వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు ఏ.సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ నాయకులు జేవై దాసు, స్టాఫ్ వర్కర్స్ సంఘం నుంచి కె.రాజేష్, బి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



పేపర్ మిల్లు ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం

● తెరుచుకున్న పేపరుమిల్లు

కలెక్టర్, జిల్లా ఎస్పీ, లేబర్ కమిషనర్ సమక్షంలో జరిగిన సమావేశంలో మిల్లు కార్మికులు, యాజమాన్య ప్రతినిధులు మధ్య సయోధ్య కుదరడంతో గురువారం రాత్రి 10 గంటల నుంచి మిల్లు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులు కలిసి జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

డిగ్రీ చదివి..పాదరక్షలు కుట్టే పని

పిఠాపురం అసెంబ్లీ నియోజ వర్గ బరిలో సామాన్యుడు



నామినేషన్‌కు వెళ్తున్న భాస్కరరావు

పిఠాపురం, ఏప్రిల్ 25: పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ చదివారు. ఉద్యోగాలు కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. కుటుంబాన్ని పోషించుకునేందుకు పాదరక్షలు కుట్టే పనిచేస్తున్నారు. తనలా చదువుకుని ఉద్యోగాలు లభించక నిరుద్యోగులుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువతీ యువకుల కష్టాలను అందరికీ తెలియజెప్పాలనే ఉద్దేశంతో పిఠాపురం అసెంబ్లీ బరిలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలవాలని నిర్ణయించుకున్నారు. ఆయనే పిఠాపురం పట్టణానికి చెందిన ఏడిద భాస్కరరావు. ఆయన ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో చెప్పులు కుట్టే పని నిర్వహిస్తారు. ఈయన గురువారం కుటుంబ సభ్యులు, స్థానికులతో కలిసి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పిఠాపురం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామసుందరరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనకు పిఠాపురం నియోజకవర్గ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన చదువుకున్న యువతకు న్యాయం జరగడం లేదని, ప్రజలకు మౌలిక వసతులు సమకూరడం లేదని చెప్పారు. తనను గెలిపిస్తే పిఠాపురం నియోజకవర్గంలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.

సత్యదేవుడికి మరో రథం

నేడు ఉదయం ప్రారంభం



అన్నవరం, ఏప్రిల్ 25: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సేవకు మరో రథం సిద్ధమైంది. సుమారు రూ 1.08 కోట్ల వ్యయంతో ఈ రథాన్ని తయారు చేశారు. శుక్రవారం ఉదయం పెద్ద రథం ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. నూతనంగా తయారుచేసిన రథాన్ని గ్రామ సేవలకు ఉపయోగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం పర్వదినాలలో సుమారు 40 ఏళ్ల క్రితం తయారు చేసిన వెండి రథం సత్యదేవుడి సేవకు వినియోగిస్తుండగా ఆ రథం శిథిలావస్థకు చేరుతుండడంతో నూతనంగా పెద్ద రథం చేయించాలని పూర్వపు ఈవో ఆజాద్ టెండర్లు పిలిచారు. నూతన రథం 35 అడుగుల ఎత్తు 15 అడుగుల వెడల్పుతో పూర్తిగా బస్తరు టేకుతో తయారు చేయించారు. మూడంతస్తులతో ఈ రథం తీర్చిదిద్దారు.

జేఈఈ మెయిన్స్‌లో 'తిరుమల' ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాజమహేంద్రవరం తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. వివిధ కేటగిరిల్లో జాతీయస్థాయిలో తమ విద్యార్థులు యు.సుధీర్ 34వ ర్యాంక్, ఎంజీ వెంకట మహేష్ 37వ ర్యాంక్, కేజే వెంకటసాయి 57వ ర్యాంక్, ఆర్ పవిత్ర 90 ర్యాంక్, యం.చరణ్ శ్రీతేజ 118వ ర్యాంక్, జి.వంశీకృష్ణ 123వ ర్యాంక్, ఎంఆర్‌యస్‌వీయస్ శ్రీమణికంఠ 149వ ర్యాంక్, జీఎస్ దుర్గసాయి 168వ ర్యాంక్ సాధించడంతో పాటు మరికొందరు 210, 217, 221, 223, 225, 238, 253, 255, 261, 265, 277, 288, 291 ర్యాంక్‌లు సాధించారని తెలిపారు. వెయ్యి లోపు 58 మంది, 5వేల లోపు 254 మంది, పదివేల లోపు 417 మంది, 20 వేలలోపు 654 మంది ర్యాంకులు సాధించారని తెలిపారు. కోచింగ్ తీసుకున్న విద్యార్థుల్లో 1358 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత పొంది 92 శాతం సక్సెస్ రేటు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరితో కలిసి ఆయన అభినందించారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో తిరుమలరావు

ఏపీసెట్ పరీక్షకు 7వేల మంది విద్యార్థులు

● నన్నయ ఉపకులపతి పద్మరాజు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలిజిబులిటీ టెస్ట్ (ఏపీసెట్) రాజమహేంద్రవరం పరిధిలో 7వేలమంది విద్యార్థులు రాస్తున్నారని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. రాజమహేంద్ర వరం పరిధిలో ఏపీ సెట్ నిర్వహణపై పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లుతో వీసీ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం పరిధిలో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. ఈనెల 28వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 నిమిషాల వరకూ పేపర్1, పేపర్2 పరీక్షలు చీఫ్ సూపరింటెండెంట్లు, పరిశీలకులు పర్యవేక్షణలో ప్రశాంత వాతావరణంలో జరుగు తాయన్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లులో సూచించిన నిబంధనలను పాటిస్తూ ఉదయం 8.30 నిమిషాలకే పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలన్నారు. నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఎపిసెట్ సభ్యులుగా వీసీ పద్మరా జు వ్యవహరిస్తున్నారన్నారు. వారి పర్యవేక్షణలో రీజనల్ పరిధిలో ఏపీసెట్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈసందర్భ ంగా రాజమహేంద్రవరం ఏపీసెట్ ప్రాంతీయ కోఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, సహాయ కోఆర్డినేటర్ ఎస్.లింగారెడ్డి పాల్గొన్నారు.

బత్తుల పేరుతో బహు నామినేషన్లు దాఖలు

రాజానగరం, ఏప్రిల్ 25 : రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల దాఖలు గడువు ముగిసేసరికి ఒకే ఇంటి పేరుతో పలువురు అభ్యర్థులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా నియోజకవర్గానికి చెందిన బత్తుల బలరామకృష్ణ పోటీచేస్తున్నారు. ఈయనతో పల్నాడు జిల్లాకు చెందిన బత్తుల బాల రామకృష్ణ నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే కాకినాడ జిల్లా నుంచి బత్తుల బలరామకృష్ణ జాతీయ జన పార్టీ తరఫున, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఇదే జిల్లాకు చెందిన బత్తుల బలరామకృష్ణ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. నామినేషన్లు ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత గానీ వీరిలో ఎంతమంది పోటీలో నిలుస్తారన్నది స్పష్టమవుతుంది.

రేపు ఏపీ పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష

కాకినాడ రూరల్, ఏప్రిల్ 25: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకోసం నిర్వహించే ఏపీ పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష ను ఈనెల 27న నిర్వహించనున్నారు. కాకినాడ జగన్నాథపురంలోని ఆంధ్రాపాలిటెక్నిక్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి కాకినాడ అర్బ న్, రూరల్ పరిధిలోని 27 పరీక్షా కేంద్రాల్లో 9,500మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పాలిసెట్ జిల్లా సమన్వయకర్త నల్లిజనార్థన రావు తెలిపారు. ప్రవేశపరీక్షను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పరీక్ష ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ జరుగుతుందని, విద్యార్థులు హాల్‌టికెట్‌ను polycet.ap.nic.in వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు ఒక గంట ముందు పరీక్షాకేంద్రాలకు చేరుకోవాల న్నారు. సందేహాలుంటే 7989350167 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు బలభద్రపురంలో విద్యుత్‌కు అంతరాయం

బిక్కవోలు, ఏప్రిల్ 25: బలభద్రపురం గ్రామంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి దృష్ట్యా మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ నిలిపి వేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌కు మద్దతుగా సీపీఐ ప్రచారం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 25 : దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం కనుమరుగై పోతున్నాయని, బీజేపీ ప్రభుత్వంలో రోజురోజుకూ నియంతృత్వం పెరిగిపోతున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని మేదరపేట, కొత్తపేట, జాంపేట మార్కెట్, రూరల్ నవభారత్‌నగర్, రైల్వేస్టేషన్ ఎదురుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఓటును సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్

కూనవరం, ఏప్రిల్25: ప్రతీ ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కూనవరం తహసీల్దార్ ఆర్‌వి మురళీకృష్ణ అన్నారు. టేకులబోరు గ్రామంలో ప్రజలతో ఆయన ఓటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు చాలా విలువైందని ఓటే ప్రజల తలరాతను మారుస్తుందన్నారు. వేసవికాలం ఎండల తీవ్రత ఎక్కువ ఉందని మండలంలోని ప్రజలు ఉదయం పూటే తమ ఓటును వినియోగించుకుని మండలంలో వందశాతం ఓటింగ్ నమోదు కావాలన్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

అనపర్తి కెనాల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తా

● అనపర్తిలో జన్మభూమి సహా ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల సాధిస్తా

● ఎన్డీయే కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

వేమగిరి సామర్లకోట రహదారిపై ప్రయాణీకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగిస్తూ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని పురందేశ్వరి సహాయంతో కేంద్రంతో మాట్లాడి పనులు పూర్తి చేస్తామని పాత ఉమ్మడి జిల్లా ప్రస్తుతం మూడు జిల్లాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించి రోడ్డు నిర్మాణం చేస్తామని అదేవిధంగా అనపర్తిలో అపరిష్కృతంగా ఉన్న పలు రైళ్ల నిలుపుదల విషయంలో కూడా జన్మభూమి సహా మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను సాధించి తీరుతానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సత్తి దేవదానరెడ్డి, ఆళ్ల గోవిందు, తమలంపూడి సుధాకరరెడ్డి, సిరపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, జుత్తుగ కృష్ణ, వెలుగుబంటి సత్తిబాబు, త్రిమూర్తులు, జనసేన నాయకుడు రావాడ నాగు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నల్లమిల్లికి విజయం చేకూరాలని మసీదు వద్ద ప్రార్థన నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

అనపర్తిలో ఎన్డీయే కూటమి విజయమే లక్ష్యంగా పనిచేయాలి

నియోజకవర్గ ఎన్డియే కూటమిలోని బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తలు కూటమి విజయానికి కృషిచేయాలని పలువురు నేతలు సూచించారు. బలభద్రపురం ఎమ్ఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నాయకులు ప్రసంగిస్తూ కూటమి అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మూడుపార్టీల కార్యకర్తలపై ఉందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున కూటమిలో గుర్తు మార్పు అంశంపై ప్రజల్లోకి ప్రచారం వెళ్ళాలని అసెంబ్లీ పార్లమెంట్ అభ్యర్థులు ఇద్దరికీ కమలం గుర్తు రావడం ప్రచారానికి కొంత సులభంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుజయ్‌కృష్ణ రంగారావు, పడాల వెంకటరామారెడ్డి, బీజేపీ రాష్ట్ర యువమోర్చా ప్రధాన కార్యదర్శి ములగపాటి శివరామకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు. .



బలభద్రపురం ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో అభివాదం చేస్తున్న నాయకులు

జన సందోహం మధ్య భారీ ర్యాలీగా నామినేషన్ వేసిన నల్లమిల్లి

అనపర్తి ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బీజేపీ తరపున నల్లమిల్లి నామినేషన్ కార్యక్రమం గురువారం విజయవంతంగా పూర్తయింది. సుమారు 15 కిలోమీటర్ల మేర సాగిన ర్యాలీలో నల్లమిల్లి వెంట వేలాదిగా అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు. రామవరం, అనపర్తి గ్రామాలలో క్రేన్ సహాయంతో భారీ గజమాలలు వేసి స్వాగతం పలికారు. అదేవిధంగా అనపర్తిలోని పాతవూరి మసీదు వద్ద నల్లమిల్లికి స్వాగతం పలికిన ముస్లిం సోదరులు నల్లమిల్లి విజయాన్ని కాంక్షిస్తూ ప్రార్థన నిర్వహించి నల్లమిల్లి, దగ్గుబాటిలను ఆశీర్వదించారు. అనపర్తికి చేరుకున్న ర్యాలీకి తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి నల్లమిల్లికి బూడిద గుమ్మడి కాయలతో హారతిచ్చి దిష్టి తీశారు. అనంతరం ఆర్వో కార్యాలయం చేరుకుని బీజేపీ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలతోపాటుగా బిఫారమ్‌కు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నల్లమిల్లి జగన్ రహిత రాష్ట్రం కోసం ఏర్పడిన కూటమి విజయమే లక్ష్యంగా తాను బీజేపీ నుంచి పోటీ చేస్తున్నానని అన్నారు. జెండా ముఖ్యంకాదని మూడు పార్టీల అజెండానే ముఖ్యమన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్ని తనను పోటీలో లేకుండా చేయాలని చేసిన ప్రయత్నాలు చేశారో ప్రజలందరూ గమనించారని చివరకు తాను పోటీలో నిలిచేసరికి నోళ్లు పెగలడం లేదన్నారు. కూటమి విజయానికి జనసేన, టిడిపి, బిజెపి కార్యకర్తలు కలసికట్టుగా పనిచేస్తారని ఇందులో ఎటువంటి సందేహం లేదని అన్నారు. అనపర్తి నియోజకవర్గంలో తాను విజయం సాధించడమే కాకుండా రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న పురందేశ్వరిని కూడా గెలిపించి తీరుతామని అన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో షిర్డిసాయి హవా

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 25: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాజమహేంద్రవరం షిర్డిసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో సత్తా చాటారు. వివరాలను షిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్య ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న జే.శ్రీకర్ ఆలిండియా 46వ ర్యాంకు సాధించగా, కె.వెంకట శివరామకృష్ణ ఆలిండియా 126వ ర్యాంకు, బి.తనుశ్రీ 347వ ర్యాంకు, సిహెచ్ బానువెంకట దీపక్ 794వ ర్యాంకు, ఎం తన్మయ్ రామ సంకీర్త్ 850వ ర్యాంకు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. 5 గురు విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంకులు, 16 మంది 2వేలలోపు ర్యాంకులు, 38 మంది 5వేల లోపుర్యాంకులు, 61 మంది 10వేల లోపు ర్యాంకులు, 82మంది 20వేల లోపుర్యాంకులు సాధించినట్లు టి.శ్రీవిద్య తెలిపారు. షిర్డిసాయి విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ హాజరైన 226 మంది విద్యార్థులలో 76 శాతం అనగా 172 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. ప్రతీఏటా తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరచడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విజేతలైన విద్యార్థులను అందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని చైర్మన్ టి.శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, లక్ష్య అకాడమీ డీన్ చంద్రశేఖర్‌లు అభినందించారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదల

కాకినాడ రూరల్, ఏప్రిల్ 25: సార్వత్రిక విద్య పదో తరగతి, ఇంటర్ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఇంటర్ పరీక్షలకు కాకినాడ జిల్లాలో 6,279మంది విద్యార్థులు హాజరుకాగా 5,146మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. 10వ తరగతి పరీక్షలకు జిల్లాలో 1947మంది విద్యార్థులు హాజరుకాగా 1369మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఇంటర్‌లో మొత్తం 81.96శాతం, 10వ తరగతిలో 70.31శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫెయిలైన 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1నుంచి 8 వరకూ జరుగుతాయని, ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10నుంచి 12 వరకూ జరుగుతాయని ఓపెన్‌స్కూల్ కాకినాడ జిల్లా సమన్వయకర్త పి.సాయివెంకటరమణ తెలిపారు.

ఆంధ్రజ్యోతి | www.andhrajyothy.com

ఏజెన్సీ సమాచారం

భారీ వర్షం..ఈదురుగాలులు



వై.రామవరంలో గాలివానకు నేలకొరిగిన మొక్కజొన్నతోట, కురుస్తున్న వర్షం

వై.రామవరం, ఏప్రిల్ 25: మండలంలో గురువారం భారీ వర్షం ఈదురుగాలులు సంభవించాయి. మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండతో సతమతమవుతున్న నేపథ్యంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తీవ్ర గాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయి గిరిజన గ్రామాలు అంధకారమయ్యాయి. పలుచోట్ల మొక్కజొన్న, అరటితోట పంటలు నేలకొరగడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

50 ఎకరాల్లో నేలకొరిగిన మొక్కజొన్న

మండలంలో గురువారం సంభవించిన గాలివానకు వై.రామవరం, యార్లగడ్డ, పైడిపుట్ట, కొమరవరం గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో మొక్కజొన్న తోట నేల కొరిగింది. మరికొద్ది రోజుల్లో పంట దిగుబడికి వస్తుందనే తరుణంలో గాలివాన సంభవించి తీవ్ర నష్టం చేకూర్చిందని మొక్కజొన్న రైతులు గగ్గోలు పెడుతున్నారు. రూలక్షల్లో నష్టం ఉంటుందని వ్యవసాయాధికారులు ఆదుకోవాలంటూ రైతులు కోరుతున్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మోతుగూడెం, ఏప్రిల్ 25: చింతూరు మండలం మోతుగూడెంలోగురువారం అత్యధికంగా 42డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మన్యంలో గత మూడు రోజుల నుంచి భానుడి ప్రభావం మాత్రం తగ్గలేదు. దీంతో గురువారం ఏజెన్సీలో ఎండ తీవ్రంత ప్రభావంతో ఎండ దాటికి బయటకు రావడానికి జనం భయపడుతున్నారు.

పోలింగ్ నిర్వహణపై అవగాహన

అడ్డతీగల, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అడ్డతీగల తహసీల్దార్ నాగమణి ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలవద్ద కనీస వసతులు నిర్వహణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు, రన్నర్, తాగునీరు తదితర వసతులు నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్, రూట్, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో అవకతవకలు

● టీడీపీ దళితనాయకుడి సుబ్బారావు ఆరోపణ

దేవీపట్నం, ఏప్రిల్ 25: మండలంలోని పెదభీంపల్లి(ఫజుల్లాబాద్) ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్లు టీడీపీ దళిత నాయకుడు పత్తి సుబ్బారావు ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫజుల్లాబాద్ ప్రజలు ఎంతో నమ్మకంతో ఓటేసి గెలిపించిన వైసీపీ వార్డు మెంబర్ కనుసన్నల్లో అవకతవకలు జరిగాయన్నారు. తన వద్ద అన్ని ఆధారాలున్నాయన్నారు. బాధ్యతగల పదవిలో ఉంటూ ఉపాధి హామీ పథకం టీఏ అధికారులతో కుమ్మక్కై దొంగమస్తర్లు వేశారన్నారు. అధికారాన్ని అడ్డుకుని అవినీతి చేయడం ఎంత వరకు కరెక్ట్ అని నిలదీశారు. ఈవిషయాన్ని రంపచోడవరం ఐటీడీఏ అధికారి దృష్టికి తీసుకెళ్తానని సుబ్బారావు స్పష్టం చేశారు.

రంపచోడవరంలో చివరి రోజు 14 నామినేషన్లు: ఆర్వో



నామినేషన్ పత్రాలు స్వీకరిస్తున్న ఆర్వో ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఏప్రిల్ 25: రంపచోడవరం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గురువారం చివరి రోజు 14 నామినేషన్లు అందాయని రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రాజవొమ్మంగి మండలం వేశవరం గ్రామానికి చెందిన లోత రామారావు సీపీఐఎం తరుపున రెండో నామినేషన్ దాఖలు చేశారు. వీఆర్ పురం మండలం రేఖపల్లి గ్రామానికి చెందిన పూనెం సత్యనారాయణ సీపీఐఎం రెండవ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఎటపాక మండలం చెన్నంపేట గ్రామానికి చెందిన రెండోసారి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. రాజవొమ్మంగి మండలం అనంతగిరి గ్రామానికి చెందిన మిరియాల శిరీషదేవి రెండో సారి రెండు నామినేషన్లు దాఖలు చేశారు. రాజవొమ్మంగి మండలం గింజర్తి గ్రామానికి చెందిన మిరియాల లోవలక్ష్మి తెలుగుదేశం డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అడ్డతీగల మండలం రాజానగరం గ్రామానికి చెందిన నాగులపల్లి ధనలక్ష్మి తరుపున ఎల్లవరం గ్రామానికి చెందిన నక్క వీర్రాజు నామినేషన్ దాఖలు చేశారు. అడ్డతీగల మండలం రాజానగరం గ్రామానికి చెందిన నాగులపల్లి ధనలక్ష్మి వైకాపా తరుపున ఎల్లవరం గ్రామానికి చెందిన తోట దేవేంద్రుడు నామినేషన్ దాఖలు చేశారు. అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామానికి చెందిన బొడ్డపాటి రాఘవ వైఎస్ఆర్ పార్టీ తరుపున డమ్మీ అభ్యర్థిగా నిమినేషన్ వేశారు. రంపచోడవరం మండలం సిరిగిందలపాడు గ్రామానికి చెందిన పాలడుగు శ్రీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా రెండోసారి నామినేషన్ వేశారు. గంగవరం మండలం మోహనాపురం గ్రామానికి చెందిన మద్దేటి అంజిరెడ్డి భారత్ ఆదివాసీ పార్టీ తరుపున నామినేషన్ వేశారు. చింతూరు మండలం చట్టి గ్రామానికి చెందిన తుర్రం అశోక్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. గంగవరం మండలానికి చెందిన కుంజం వీరవెంకటసత్యనారాయణమ్మ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కూనవరం మండలం తాళ్లగూడెం గ్రామానికి చెందిన బంగారు వెంకటేశ్వర్లు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నియోజవర్గంలో నేటి వరకు 17 మంది అభ్యర్థులకుగాను 26 నామినేషన్ పత్రాలు అందాయన్నారు. ఏఆర్వో ఎ.కృష్ణజ్యోతి, తహశీల్దారు నాగరాజు. డీటీలు ఎస్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, శివ, రామకృష్ణ, చైతన్య, విశ్వనాథ్, సరిత, బాలాజీ, శ్రీధర్, రవీంద్రబాబు, వీరభద్రరావు పాల్గొన్నారు.

రంపలో 17 మంది అభ్యర్థులకు 26 నామినేషన్లు: ఆర్వో

రంపచోడవరం ఎస్టీ నియోజకవర్గంలో 17 మ ంది అభ్యర్థులకుగాను 26 నామినేషన్లు వేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాం త్‌కుమార్ తెలిపారు. నామినేషన్లను నేడు(శుక్రవారం) పరిశీలన జరుగుతుంద న్నారు. ఈనెల 29న మధ్యాహ్నం 3గంటలకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుందన్నారు.

వైసీపీ నాయకులపై కోడ్ ఉల్లంఘన కేసు నమోదు

సీతానగరం, ఏప్రిల్ 25:సీతానగరంలో ఎన్నికలకోడ్ ఉల్లంఘించి వైఎస్ఆర్ విగ్రహానికి ముసుగుతొలగించి పాలాభిషేకం చేసినందున వారిపై ఎంసీసీకి ప్రతిపక్షాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీతానగరం ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. బుధవారం సీతానగరం, చినకొండేపూడిలో జక్కంపూడి రాజా ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహించా రు. నాలుగుబొమ్మల సెంటర్‌లోని నడిందొడ్డివద్ద ఉన్న వైఎస్ ఆర్ విగ్రహానికి ఉన్న ముసుగు తొలగించి వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ప్రతిపక్షాలు ఎంసీసీకి ఫిర్యాదు చేయడం తో ఎంసీసీ ఆదేశాలతో కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం అందాలంటే టీడీపీని గెలిపించండి

● ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చియ్య చౌదరి



ప్రచారంలో ఓటర్లను అభ్యర్థిస్తున్న గోరంట్ల

ధవళేశ్వరం, ఏప్రిల్ 25:నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి జరగాలన్నా టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని గోరంట్ల బుచ్చియ్యచౌదరి ఓటర్లను అభ్యర్థించారు. గురువారం ఉదయం ధవళేశ్వరంలోని ఎర్రకొండపై టీడీపీ పట్టణాధ్యక్షుడు పండూరి అప్పారావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన కుమార్తె శిరీషలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలు అందించే సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని అందు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అసెంబ్లీ అభ్యర్థిగా తనకు సైకిల్‌గుర్తుపై, పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటువేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డిరాంబాబు, వెలుగు మహిళప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, యర్రా వేణు, ఆళ్లఆనందరావు, పిన్నంటి ఏకబాబు,తలారి మూర్తి, యర్రమోతు ధర్మరాజు, వర్రే రాజేష్,సావాడ శ్రీనివాస రెడ్డి,నీలి కోటేశ్వరరావు, నాళ్ళ రమేష్, ఇళ్ళ రాంబాబు, జనసేన నాయకులు దూది సాయి, యడ్ల వెంకటేష్, పిల్లి శ్రీను, బీజేపీ నాయకులు స్వామి, గుర్రాల వెంకట్రావు,పి. అనూజ, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

గోరంట్ల విస్తృతప్రచారం

కడియం/రాజమహేంద్రవరంరూరల్ : టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీషలు గురువారం రాజమహేంద్రవరం రూరల్ హుకుంపేట, రామకృష్ణ నగర్‌లో పర్యటించారు. తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మంచినీరు అందించే విధంగా చంద్రబాబు ఆలోచన చేశారన్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. ప్రజలంతా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిని బలపరిచి అధికారంలోకి తీసుకు రావాలని ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్న తనకు సైకిల్ గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థి నిగా పోటీచేస్తున్న నందమూరి తారకరామారావు కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా ఓటేసి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. మత్యేటి ప్రసాద్, దుద్దుపూడి రామకృష్ణ, పెండ్యాల రామకృష్ణ, బొప్పన అప్పారావు, మార్ని వాసుదేవరావు, వాసిరెడ్డి రాంబాబు, మజ్జి పద్మ, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, యలమాటి రామకృష్ణ, మార్ని సత్యనారాయణ, పిన్నింటి ఏకబాబు, ఆళ్ళ ఆనందరావు, బొప్పన నరేంద్ర, బొప్పన సతీష్, కురుకూరి కిషోర్, మార్ని పాపారావు, బత్తిన ఏడుకొండు, మట్టా శ్రీనివాస్, చిట్టూరి వేణుగోపాలకృష్ణ రత్నాకర్ కోటిపల్లి చంద్రశేఖర్, ఎంఎంఎల్ రాజు, కోరాడ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



ఉల్లిపాయల షాపువద్ద ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల

● పిడింగొయ్యిలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీషలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మట్టా శ్రీను, మార్ని వాసు, బాసుమళ్ళ మోహన్, కసిరెడ్డి దుర్గాప్రసాద్, బాబూ ఖాన్, బొప్పన నాగేశ్వరరావు, కోరాడ వెంకటేశ్, పత్తి మంగ, కాపా శ్రీను, బొప్పన శ్రీను, ముప్పిడి రాంబాబు, గెడ్డం ప్రభుదాస్ , రామోజీ గౌరీ, దేవర్లంక మంగాయమ్మ, ఎడ్ల రామకృష్ణ, నాగరాజు, పాపారావు చౌదరి, ధనకొండ రాజు, మార్ని శ్రీను, బీజేపీ నాయకులు ఎన్‌వీబీఎన్ ఆచారి, కరుటూరి శ్రీనివాసరావు, తనుబుద్దిసూర్యభాస్కర్, తాడి కోటేశ్వరరావు, కోదండరాము, అడపా వరప్రసాద్, దోనేపూడి రుక్మంధరరావు పాల్గొన్నారు.

ఆఖరి రోజు నామినేషన్ల జోరు

రాజానగరం, ఏప్రిల్ 25 : నామినేషన్ల ప్రక్రియలో భాగంగా రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఆఖరి రోజైన గురువారం నామినేషన్ల దాఖలు జోరందుకున్నాయి. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ తరపున కొత్తపల్లి భాస్కరరామం రెండో సెట్ నామినేషన్ దాఖలు చేయగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున గంధం రాజేశ్వరి, నాలం సూర్యలక్ష్మి నారాయణ రెండవ సెట్టు నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బర్రే ఆనందకుమార్ రెండో సెట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థిగా బత్తుల బాలబ్రహ్మం నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ తరపున ముంద్రు వెంకట శ్రీనివాస్ మూడు, నాలుగు సెట్లు నామినేషన్ దాఖలు చేయగా, జై భారత్ నేషనల్ పార్టీ తరపున పొనగంటి అప్పల సత్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ ప్రజాబంధు పార్టీ తరపున మద్దా వెంకటరావు, బహుజన సమాజ పార్టీ తరపున, నల్లమిల్లి రవికుమార్, కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ కుమార్తె బత్తుల వందన అంబిక ఇండిపెండెంట్ అభ్యర్థిగా, కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ తరపున దొడ్డ వెంకటేశ్వర్లు రెండు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. భారతీయ చైతన్య పార్టీ తరఫున కట్టా కృష్ణ రెండో సెట్టు నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు ఆర్వో చైత్రవర్షిణి తెలిపారు.

సీతాపురంలో చలివేంద్రం ప్రారంభం

ఎటపాక, ఏప్రిల్ 25 : ఎటపాక మండలం, సీతాపురం ప్రధాన సెంటర్ లో గురువారం చలివేంద్రంను ప్రారంభించారు. దివంగత టీపీవీడు ఎంపీటీసీ చుంద్రు శ్రీదేవీ, చుంద్రు రాధాకృష్ణ జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యుడు టీడీపీ యూనిట్ ఇంచార్జ్ బానినేని మల్లేశ్వరరావు ఈ చలివేంద్రంను ఏర్పాటు చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు కిలారి వెంకటేశ్వరరావు, అరకు పార్లమెంటరీ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్ చేతులు మీదుగా చలివేంద్రంను ప్రారంభించారు. వేసవి ముగిసే వరకు చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు పుట్టి రమేష్, తెలుగు యువత రాష్ట్ర ప్రదాన కార్యదర్శి వల్లభనేని చందు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మారాసు గంగాధర్, బీజేపీ మండలాధ్యక్షులు మోదుగు పెరమయ్య, ఏపూరి వెంకన్న, బీజేపీ నాయకులు బొల్లా ప్రసాద్, దుద్దుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఇంటింటా ప్రచారం

మోతుగూడెం, ఏప్రిల్ 25: చింతూరు మండలం మోతుగూడెం ఇండియా కూటమి బలపరుస్తున్న రంపచోడవరం సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోత రామారావు, ఎంపీ అభ్యర్థి పి.అపక్షాల నరస్పయ్యలను గెలిపించాలని కోరుతూ గురువారం మోతుగూడెం పురవీధుల్లో, పొల్లూరు, ఫోర్ బై, ఒడియా క్యాంపు, ఇంతలూరు వాగుల వద్ద విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు కేత గోపాలం, సీపీఎం సీనియర్ నాయకులు చింతా రాంబాబు, శ్రీనాథ్ సురేష్, కాంగ్రెస్‌మాజీ ఎంపీటీసీ మొండేటివెంకటేశ్వరరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన వేమగిరి మాజీ సర్పంచ్ గుత్తుల

కడియం/రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 25: కడియం మండలం వేమగిరి మాజీ సర్పంచ్ గుత్తుల హరిప్రసాద్ భారతీయ జనతాపార్టీలో చేరారు. రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో హరిప్రసాద్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి, కాషాయకండువాను గుత్తులకువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఇన్‌చార్జి ఆకుల శ్రీధర్, మండల బీజేపీ అధ్యక్షులు నాగులపల్లి వీరబాబు, సీనియర్ బీజేపీ నాయకులు ఒంటెద్దు స్వామి, పి.శ్రీదేవి తదిరతులు ఉన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయేది బీజేపీ, తెలుగుదేశం, జనసేన ఉమ్మడి కూటమి అన్నారు. ఓడిపోయే వైసీపీకి ఓటు వేస్తే ఓటు వృదా అవుతుందని పురందేశ్వరి తెలిపారు.

ఎన్నికల సాధారణ పరిశీలకులను కలిసిన ఎస్పీ జగదీష్



ఎన్నికల సాధారణపరిశీలకుడు కమల కాంత్‌సరోఫ్‌ను కలిసిన పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ జగదీష్

ధవళేశ్వరం, ఏప్రిల్ 25: ఎన్నికల సాధారణపరిశీలకులగా నియమితులైన కమలకాంత్‌సరోఫ్‌ను ఎస్పీ జగదీష్ కలలిశారు. కాటన్ అతిధి గృహంలో బస చేసిన ఆయన్ను గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

చట్టంతో విభేదించిన పిల్లలతో నిబంధనల ప్రకారం నడుచుకోవాలి: డీఎల్ఎస్ఏ కార్యదర్శి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చట్టంతో విభేదించిన పిల్లలతో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. చట్టంతో విభేదించిన పిల్లల హక్కులను పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు తదితరుల కర్తవ్యాల గురించి వివరించారు. అనంతరం పర్యవేక్షణ గృహాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. పర్యవేక్షణలో ఉన్న బాలలతో మాట్లాడారు. సంక్షేమానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా డీఎల్ఎస్ఏకి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జేజేబీ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ సి.రమ్య తదితరులు పాల్గొన్నారు.

జంతు ప్రేమికులకు నీటికుండీల పంపిణీ

రాజబహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 25: స్థానిక లలితానగర్‌లో గురువారం ఉదయం పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు, నామన ధనరాజు జ్ఞాపకార్థం, మూగజీవాలకు వేసవిలో దాహార్తిని తీర్చే నీటికుండీలను పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పంతం కొండలరావు చేతులమీదుగా జంతు ప్రేమికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంతం కొండలరావు మాట్లాడుతూ సమాజంలో పర్యావరణ సమతుల్యానికి అందరూ సహకరించాలని, నోరులేని మూగజీవాల పరిరక్షణకు తనవంతుగా కృషిచేయడం ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్పందించాలని అన్నారు. ఈ బృహత్తర సేవా కార్యక్రమంలో జంతు ప్రేమికులు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని ముందుకు తీసుకువెళ్ళాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నామన ధనరాజు కుమారులు నామన బాబీ,నామన వాసు, ఆదిత్యా విద్యా సంస్థల ఎస్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీవిఎస్ నాగేశ్వరరావు, రోటరీ క్లబ్ జనరల్ సెక్రటరీ ఎల్ శ్రీనివాస్, అమీర్ పాషా, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యురాలు మహనక్ష్మి,సమాజ సేవకుడు పడాల శ్రీను,38వ వార్డు మహిళలు, 39వ వార్డు ఫెండ్స్ సర్కిలక్ష, లలితానగర్ ఫ్రెండ్స్ సర్కిల్,పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు సభ్యులు, జంతుప్రేమికులు పాల్గొన్నారు.

పేదలను దోచుకు తినే వైసీపీని సాగనంపండి: జ్యోతుల నెహ్రూ

గోకవరం, ఏప్రిల్25: పేదలను దోచుకు తినే వైసీపీ ప్రభుత్వాన్ని ఇక సాగనంపాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని వెంకటనగరం, గోపాలపురం, ఇటికాయిలపల్లి, గాదెలపాలెం గ్రామాలలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలో నెహ్రూ మాట్లాడుతూ ఐదేళ్లలో విధ్వంస పాలన కొనసాగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాలను మోసం చేస్తూ సహజ వనరులను సైతం దోచుకు తిన్నారని వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు అన్నివిధాలా మెరుగుపడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఒక ఓటు, గాజుగ్లాస్‌పై మరొక ఓటు వేయాలంటూ నెహ్రూ ఓటర్లను అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు మోపర్తి కృష్ణ, గళ్ళా రాము, తదితరులు పాల్గొన్నారు.

● గోకవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు గురువారం ఆపార్టీని వీడి కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరారు. టౌన్ వైసీపీ యువ నాయకుడు చింతల రవికాంత్ ఆధ్వర్యంలో సుమారు 20 కుటుంబాలు, సంగుల మణికంఠ ఆధ్వర్యంలో మరో 20 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరందరికీ నెహ్రూ పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు.

సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు కోరుతున్నారు: గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25: తెలుగుదేశం పార్టీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు కోరుకుంటున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. స్థానిక 36వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజలను కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే కూటమి అభ్యర్థిగా ఆదిరెడ్డి శ్రీనివాస్ ను కూటమి ఎంపి అభ్యర్థి గా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు.

ఆర్వో కార్యాలయాన్ని సందర్శించిన సాధారణ పరిశీలకులు

రాజానగరం, ఏప్రిల్ 25: నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సాధారణ పరిశీలకులు కె.బాలసుబ్రహ్మణ్యం గురువారం సందర్శించారు. దీనిలో భాగంగా ఆర్వో కార్యాలయంలోని ఎన్నికల వ్యయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణికి పలు సూచనలు, సలహాలు అందించారు. అలాగే పలు పోలింగ్ కేంద్రాలను కూడా ఆయన పరిశీలించారు. అలాగే నన్నయ యూనివర్సిటీలోని ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ విభాగాలను సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం నామినేషన్ల ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన తహసీల్దార్లు అబ్దుల్ రెహమాన్, నెల్సన్ పాల్‌బాబు, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

శుద్ధి చేసిన గోదావరి జలాల సరఫరాలో గత ప్రభుత్వాలు విఫలం

దివాన్‌చెరువు, ఏప్రిల్25: గోదావరి చెంతనేఉన్నా చాగల్నాడుప్రాంతంలోని మెజార్టీ గామాల ప్రజలకి గోదావరి జలాలను శుద్ధి చేసి తాగునీరుగా అందించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి చీకట్లవెంకటేశ్వరరావు అన్నారు. ఈమేరకు గురువారం ఇక్కడ పత్రికా ప్రకటనను ఆయన విడుదల చేశారు. గోదావరికి కూతవేటు దూరంలో ఉన్న చాగల్నాడు గ్రామాలైన పాతతుంగ పాడు, కొత్తతుంగపాడు, తొకాడ, కానవరం, పల్లకడియం, ఈలకొలను, ముక్కినాడ, పరిజల్లిపేట తదితర గ్రామాలలో ప్రజలు సురక్షితమైన తాగునీరులేక అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ప్రభుత్వం మంచినీటి టాంకులను నిర్మించి భూగర్భజలాలను సరఫరా చేయడం వల్ల సుద్ధనీరు తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

ఆర్టీసీలో ఆదర్శ ఉద్యోగులకు సత్కారం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 25 : రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో ఆవరణలో గురువారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. డిపోలో అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లకు, అత్యధిక ఈపీకే తీసుకొచ్చిన నలుగురు కండక్టర్లకు, ఇద్దరు డ్రైవర్లకు, ప్రతిభ కనబరిచిన గ్యారేజీ సిబ్బందికి డిపో మేనేజర్ షేక్ షబ్బం ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు, నగదు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎం.అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ ఈశ్వరరావు, బస్ స్టేషన్ మేనేజర్ త్రిమూర్తులు, ట్రాఫిక్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజానగరం, ఏప్రిల్ 25 : వార్షిక మరమ్మతుల్లో భాగంగా రాజానగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11కేవీ పరిధిలో పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌డాట్ల శ్రీధర్ వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకారణంగా రాజానగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్లకు రాజానగరం, తూర్పుగోనగూడెం, సూర్యారావుపేట, పల్లకడియం, రామస్వామిపేట, బ్రిడ్జి కౌంటీ, జీఎస్ఎల్, నన్నయ యూనివర్శిటీ, గైట్ కళాశాల ప్రాంతాలతో పాటు వ్యవసాయ బోర్లకు కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

గోపాలపురంలో కాంగ్రెస్‌కు భారీ ఓటింగ్!

▸▸ పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



గోపాలపురంలో ఆర్వో కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న రుద్రరాజు

గోపాలపురం, ఏప్రిల్ 25: గోపాలపురం గడ్డ కాంగ్రెస్ అడ్డ అనే విధంగా బైక్‌ర్యాలీ, కార్లతో తరలి వచ్చిన కాంగ్రెస్ అభిమానుల ఉత్సాహం చూస్తే పార్టీకి ఈ నియోజకవర్గంలో భారీ ఓటింగ్ నమోదయ్యేలా ఉందని పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. గోపాలపురం నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి మార్టిన్ లూథర్ తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివజ్యోతికి గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చారు. కార్యక్రమంలో రాజమండ్రి అర్బన్ అభ్యర్థి బోడా వెంకట్, కొవ్వూరు అభ్యర్థి అరుణకుమారి, జ్యేష్ట సతీష్‌బాబు, హరిబాబు, వీరగణేష్, సీపీఐ, సీపీఎం నాయకు లతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీగా గిడుగును గెలిపించండి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25: రాజమహేంద్రవరం ఎంపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ నాయకుడు గిడుగు రుద్రరాజును, సిటీకి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న బోడా వెంకట్‌లను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. రాజమహేంద్రవరం జట్టు లేబరు యూనియన్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు అధ్యక్షతన కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన, బోడా వెంకట్ పాల్గొన్నారు. జరిగిన సమావేశంలో మధు మాట్లాడుతూ ఎంపీగా గిడుగు రుద్రరాజుకు, ఎమ్మెల్యేగా బోడా వెంకట్‌లకు హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా విభజించి కార్మిక చట్టాలకు తూట్లు పొడిచారని, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి యాజమాన్యాలకు కార్మికులను బానిసలుగా చేశారన్నారు.

కోదండ రామాలయంలో భారీ అన్న సమారాధన

రంపచోడవరం, ఏప్రిల్ 25: స్థానిక కోదండ రామాలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్య నుంచి తీసుకు వచ్చిన బలరాముడు ప్రసాదం వృద్ధిచేసి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. నారాయణ గిరిపై వెలసిన శ్రీవెంకటేశ్వరుని బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకుడు అద్దంగి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీనివాసుని కళ్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏఎస్పీ జగదీష్ అడహళ్లి విచ్చేసి పూజలు నిర్వహించినట్లు నల్లమిల్లి వెంకట రామారెడ్డి తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం ఆలోచించండి

● చంద్రబాబును అధికారంలోకి తీసుకురండి
● ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



వండ్రంగి పనికి సహకరిస్తూ ప్రచారం చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25: వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోక వెనుకబడిన ప్రజలందరూ రాష్ట్ర భవిష్యత్తుకోసం ఆలోసించాలని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 38వ డివిజన్‌లో గురువారం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు బుడ్డిగ రవి, రాష్ట్ర కార్యదర్శి బుడ్డిగ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి పర్యవేక్షణలో ఇంటింటా ప్రచారం చేశారు. దీనికి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన రాజమహేంద్రవరం ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్‌లతో కలసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక వ్యాపారులు, మహిళలు, కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు, తాపీ కార్మికులు, వడ్రంగి పనివార్లను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్ల సైకో పాలనలో విసిగి వేశారని ప్రజలు చంద్రబాబు నాయకత్వం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. ప్రతీ పనిలోను 25శాతం కమిషన్ తీసుకున్న భరత్‌రామ్ లాంటి వాడు రాజకీయాలకు పనికిరాడన్నారు. తనకు సైకిల్ గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నగర కార్యనిర్వాహక కార్యదర్శి మరుకుర్తి రవియాదవ్, మళ్ళ వెంకట్రాజు, శ్యామల, దేవిన సోమశేఖర్, చిట్టాబత్తిన గాంధీ, నిమిషకవి వెంకటేష్, రమణమూర్తి వీరబాబు, ప్రసాద్, ఎస్‌కె బాను, భాస్కరమ్మ, చంటి ,వరలక్ష్మి, అమ్మాజి, సింహా గణేష్, వై సూర్యచంద్రరావు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేపరుమిల్లు యాజమాన్యంతో భరత్‌రామ్ చీకటి ఒప్పందం

● కార్మికులకు భరోసా ఇచ్చిన కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి

పేపరుమిల్లు యాజమాన్యంతో మార్గానిభరత్ రామ్ చీకటి ఒప్పందం పెట్టుకుని కార్మికులకు అన్యాయం చేశాడని రాజమహేంద్రవరం సిటీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావులు అన్నారు. పేపరుమిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించిన నేపథ్యంలో కార్మికులను కలిసి వారికి అండగా నిలిచేందుకు గురువారం ఉదయం వారు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డిమణి, టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు, నగర అధ్యక్షుడు నల్లం శ్రీను, టీడీపీ పార్లమెంట్ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కొయ్యల రమణ, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, మాజీ కార్పొరేటర్ మొకమాటి సత్యనారాయణలు మిల్లు వద్దకు చేరుకున్నారు. కార్మికులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ అధికారంలో ఉన్నప్పుడు మిల్లు కార్మికుల హక్కులకు భంగం కలిగినా, సమస్యలు పరిష్కరించకపోయినా నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంవో కార్యాలయం నుంచి మిల్లు యాజమాన్యానికి ఫోనుచేసి కార్మికులకు న్యాయం చేయాలని చెప్పి చేయించేవారని కానీ ఈ ముఖ్యమంత్రి జగన్ మాత్రం కార్మికుల సమస్యలు చెబితే మీకు జీతాలు ఎక్కువట కదా అని హేళనగా మాట్లాడారని కార్మికులే చెబుతున్నారన్నారు. మరోపక్క భరత్‌రామ్ యాజమాన్యం నుంచి బ్యాగులు పట్టుకుపోయాడని అందుకే అతను ఇప్పటివరకు యాజమాన్యానికి వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. పైగా కార్మికుల ముందుకు వచ్చి మాట్లాడటానికి భయపడుతున్నాడన్నారు. భరత్ అనుచరుడు చిట్టూరి ప్రవీణ్‌చౌదరి మిల్లులో ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షలాది రూపాయలు దోచుకున్నాడని ఆరోపించారు.కూటమి అధికారంలోకిరాగానే కార్మికుల డిమాండ్ ప్రకారమే అగ్రిమెంట్ చేయిస్తామన్నారు.



పేపరుమిల్లు కార్మికులతో మాట్లాడి భరోసా ఇస్తున్న టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్



అమ్మో ఒకటో తేదీ..

ఏ ప్రభుత్వంలోనైనా ప్రభుత్వ ఉద్యోగులు జీతాలు, పింఛన్లు కోసం ఎదురుచూడడం విన్నారా..!? ఠంచన్‌గా ఒకటో తేదీనే పడిపోయేవి.. మరి జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాతో ఒకటో తేదీ అనే మాటే మరిచిపోయారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఓపీఎస్ మాట దేవుడెరుగు. ప్రభుత్వోద్యోగులకు అసలు జీతాలు కూడా సమయానికి అందిన దాఖలాలు లేవు. ఎన్నడూ లేనిది జీతం కోసం సమ్మె చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. కాస్త గట్టిగా గళం విప్పిన ఉద్యోగులపై కక్ష సాధింపులకు దిగారు. రకరకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. టీచర్ల పరిస్థితి మరీ దారుణంగా మారింది. నాలుగైదు నెలల పాటు జీతాలు లేక తీవ్రమైన సమస్యలు ఎదుర్కొన్నారు. టీఏ, డీఏ బిల్లుల గురించి అడిగే అవకాశం లేదు. గత ప్రభుత్వంలో.. పోలీసులు ఏదైనా బందోబస్తు విధులపై వెళ్తే అడ్వాన్సు డీఏ అని భోజనం తదితర అవసరాల కోసం కొంత మొత్తం ఇచ్చి పంపేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అసలు ఆ హెడ్(అకౌంట్)నే లేపేసింది. దీంతో బందోబస్తులకు వెళ్లే పోలీసులు టీ నీళ్లకూ నానాయాతన పడేవారు.

రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి/అమలాపురం రూరల్/ తుని రూరల్/సామర్లకోట/ అమలాపురం రూరల్/ నిడదవోలు/ పెద్దాపురం/ముమ్మిడివరం/ పి.గన్నవరం

మాట తప్పాడు.. మడమ తిప్పాడు.. నాడు హామీలిచ్చాడు.. అమలు చేయలేకపోయాడు.. అడిగితే అధికారంతో అణగదొక్కేశాడు.. ఎందుకో తెలియదు కానీ సర్కారు ఉద్యోగులపై పగపట్టాడు.. జగన్ సీఎం పీఠం ఎక్కిన తర్వాత సర్కారీ కొలువుల చరిత్రలోనే మొదటిసారిగా 'జీతాలు పడ్డాయా' అనే మాట పుట్టుకొచ్చింది. అంగన్‌వాడీలకు తాళాలు పడ్డాయి. ఆశాలు కన్నీరు మున్నీరయ్యారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు పెన్‌డౌన్ చేశారు. చిరుద్యోగులు చితికిపోయారు. మునిసిపల్ కార్మికులు రగిలిపోయారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నోసార్లు ప్రభుత్వోద్యోగులు రోడ్డెక్కారు. ఇక టీఏ, డీఏ తదితర బిల్లుల సంగతే లేదు.. జగన్ ప్రభుత్వం బెదిరింపులతో ఐదేళ్లు గడిపేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే జగన్ మాటలన్నీ దగా అని నిరూపితమైంది.



సర్కారు వారి 'పగ'

ఐదేళ్లూ ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి

- నాడు అధికారం కోసం అలవికాని హామీలు
- సీఎం పీఠమెక్కిన తరువాత అణిచివేతే లక్ష్యం
- అటకెక్కిన సీపీఎస్ రద్దు హామీ
- ఆశాల ఊసూలేదు.. అంగన్‌వాడీల మాటాలేదు
- బిల్లుల చెల్లింపుల్లేవ్.. బెదిరింపులతో పాలన

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఆకలి కేకలు

మధ్యాహ్నం భోజన పథకం కార్మికులను జగన్ సర్కారు కష్టాలకు గురిచేసింది. ప్రభుత్వం ఆర్భాటంగా తీసుకొచ్చిన రాగి జావ తయారీ, వడ్డింపునూ వాళ్లపైనే రుద్దింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిన భారం ఎండీఎం కార్మికులను ఘోరంగా తిప్పలు పెట్టింది. నాలుగేళ్ల నుంచీ పెరుగుతూ వస్తున్న ధరల వల్ల ప్రభుత్వం చెల్లించే సొమ్ము కంటే పెట్టుబడి ఎక్కువవుతోంది. దీంతో నెలకు బిల్లు చేతికి వచ్చే సరికి అప్పులకు పోగా ఇంకా అప్పులు ఎదురుచూస్తూనే ఉండే పరిస్థితి వచ్చింది. గౌరవ భృతి పెంపు, మెనూ చార్జీల సవరణ వంటివి జగన్ ఎప్పుడూ పట్టించుకోలేదు. పిల్లలకు ఈ ప్రభుత్వం నాణ్యమైన గుడ్లను సరఫరా చేయలేకపోయింది. సన్నబియ్యం ఇవ్వడమూ చేతగాలేదు. ఫోర్టిఫైడ్ రైస్ అంటూ బియ్యంలో వేరొక రకం కలిపి ఇస్తోంది. అధిక శాతం పచ్చిబియ్యం సరఫరా అవుతుండడంతో జగన్ మామయ్యను పిల్లలు తిట్టుకుంటూనే 'గోరంత ముద్ద' తింటున్నారు.

ఆశా..నిరాశే..

ఆశావర్కర్ల ఆవేదన సర్కారుకి వినపడలేదు. ఎన్నో సార్లు నిరసన తెలిపినా ఆడబిడ్డల కష్టం జగన్‌కి కనిపించలేదు. ఆశలు జాబ్ చార్టులోని పనులతో పాటు ఎన్నో పనులు అదనంగా చేయాల్సి వచ్చేది. దీనికి ప్రభుత్వం ఫోన్ ఇచ్చింది. ఆ ఫోన్‌లో 8 రకాల పనులు అప్‌లోడ్ చేయాల్సి వచ్చేది. నాణ్యమైన ఫోన్ కాకపోవడం పైగా 2జీ నెట్ కావడంతో ఆశాలు ప్రతిరోజూ నరకం చూసేవారు. ఆశావర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రెండేళ్ల నుంచీ తీసేశారు. ఆశాలకు కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు లేవు. పీఎఫ్, ఈఎస్ఐ, మెటర్నిటీ, మెడికల్ లీవుల సదుపాయం లేనేలేదు. ముఖ్యంగా కొవిడ్‌కాలంలో చనిపోయిన ఆశావర్కర్ల కుటుంబీలకు ఉద్యోగాలు ఇవ్వడానికి కూడా జగన్‌కి చేతులు రాలేదు.

అంగన్‌వాడీలపై ఉక్కుపాదం..

సుమారు 50 రోజులు అంగన్‌వాడీలు ఎండనక.. వాననక ఆందోళన చేశారు.. ఏదో ఒకటి సాధించాలని భీష్మించారు. అయితే జగన్ ప్రభుత్వం ఊరుకుంటుందా.. ఆందోళన చేస్తే ఉద్యోగం పీకేస్తామని భయపెట్టింది.. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు ప్రభుత్వోద్యోగులతో బద్దలు కొట్టించి ప్రభుత్వమే తాళాలు వేయించడం బహుశా చరిత్రలో జగన్ జమానాలోనే తొలిసారి చూశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక కేవలం రూ.వెయ్యి మాత్రమే వేతనం పెంచారు. తెలంగాణలో మాదిరిగా జీతం ఇస్తామనే మాటను జగన్ తప్పారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, 2022 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా.. కొన్ని రాష్ట్రాలు అమలు చేసినా జగన్ మాత్రం పట్టించుకోలేదు.





టీచర్ల నిరసన

ఉద్యోగులకు సమగ్ర 'శిక్ష'

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'సమగ్ర శిక్ష' ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనాల వెతలు శ్రుతి మించిపోవడంతో సిబ్బంది పెన్‌డౌన్ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 414 మంది ఉద్యోగులు ఉండగా వారికి నెలకు రూ.85లక్షల జీతాలు కూడా జగన్ చెల్లించలేకపోయేవారు. కేంద్ర ప్రభుత్వ వాటానూ రాష్ట్ర ప్రభుత్వం దిగమింగేది.

గురువులను రోడ్డెక్కించారు..

అధికారంలోకి వస్తే వారంరోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని ప్రతిపక్షనేతగా జగన్ ఐదేళ్ల కిందట పాదయాత్రలో హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత మడమ తిప్పారు. సీపీఎస్ రద్దు చేయలేమని ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని, దానికంటే మెరుగైన జీపీఎస్ ఇస్తామని మాట మార్చారు. సీపీఎస్ విధానం రద్దుకు రాష్ట్రంలో ఉద్యోగులు తెలపని నిరసన లేదు. చేయని ఆందోళన లేదు. సీపీఎస్‌పై సమరభేరి మోగించి సమస్యను వివిధ రూపాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేశారు. ఇచ్చిన హామీ పక్కన పెట్టిన జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాని కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీనికి వ్యతిరేకంగా ప్రశ్నించిన వారి గొంతు నొక్కాలని, ఆందోళనను అణచివేయాలని ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించినా, అరెస్ట్ చేసినా ఉద్యోగులు ముక్తకంఠంతో నినదిస్తూనే ఉన్నారు.

జీతమూ లేదు.. పర్మినెంటూ లేదు..



గోదావరి సెంట్రల్ డెల్టా సిస్టమ్‌లో ఉమ్మడి గోదావరి జిల్లాల నుంచి 611 మంది ఇరిగేషన్ శాఖలో లస్కర్లుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరితో జూన్ 1 నుంచి మార్చి 31 వరకూ పనిచేయించుకుంటున్నారు. నెలకు రూ.10,500 జీతంగా మాత్రమే ఇస్తున్నారు. లస్కర్ల సంఘం తరఫున గత మూడేళ్లలో రెండు సార్లు సీఎం జగన్‌ను కలిసి రెగ్యులర్ చేయాలని వేడుకున్నాం. లస్కర్లను ఆప్కాస్‌లో చేరుస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చ లేదు. ప్రస్తుతం పన్నెండు నెలల జీతాల బకాయిలు అందించాల్సి ఉంది. **- ఉండపల్లి సూర్యచంద్ర, లస్కర్ల సంఘం అధ్యక్షుడు**

సీపీఎస్ రద్దుకు వారమన్నారు..ఐదేళ్లయింది?



వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన వారంలోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని జగన్ హామీ ఇచ్చి అమలు చేయకపోవడం నష్టం కలిగిస్తోంది. పదకొండో పీఆర్సీ ఇస్తానని చెప్పి రివర్స్ పీఆర్సీ ఇవ్వడం న్యాయమా. ఎనిమిది డీఏ బకాయిలు, ఎరియర్స్ చెల్లించకపోవడం దారుణం. వాటి సాధనకు ఉద్యమిస్తే అణచివేయడం దుర్మార్గం.
పి.హిమబిందు, ఎస్టీయూ మండల అధ్యక్షురాలు, ముమ్మిడివరం

నాడు హామీలతో ఓట్లు దండుకున్నారు..



అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి ఓట్లు దండుకున్నారు. కొత్తగా తెరపైకి తెచ్చిన జీపీఎస్‌తో ఉద్యోగులకు నష్టమే తప్ప లాభం లేదు. ఈ విధానంలో ఉద్యోగులు తమ జీతం నుంచి 10 శాతం కంట్రిబ్యూట్ చేయాల్సిందే. ఓపీఎస్ అమలుకు పోరాటం చేస్తున్నా వైసీపీ ప్రభుత్వం స్పందించట్లేదు.
- దూనబోయిన రామకృష్ణ, యూటీఎఫ్ పి.గన్నవరం మండల అధ్యక్షుడు

నాడు అధికారానికి హామీలు.. తర్వాత కొర్రీలు



ఉద్యోగుల స్వేచ్ఛను హరించి ఎందరిపైనో కేసులు పెట్టించారు. సంఘ విద్రోహ శక్తులుగా ముద్రవేసి పోలీసుస్టేషన్ల చుట్టూ తిప్పడంతో ఏ ఒక్క ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో మరిచిపోలేరు.కొవిడ్‌లో ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్ద విధులు నిర్వహింపచేసిన తీరు ఏ ఒక్క గురువూ మరిచిపోలేరు. సకాలంలో జీతాలు చెల్లించలేని దుస్థితికి తెచ్చారు.
- సరిదే సత్యపల్లంరాజు, ఎస్టీయూ జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి

సీపీఎస్ రద్దు హామీ నెరవేర్చకపోవడం దారుణం



ఉద్యోగుల ఆర్థిక జీవన భద్రతకు గ్యారెంటీ లేని సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి. మా కుటుంబాలు ఆర్థిక ప్రయోజనాలు మాకు ముఖ్యం. ఓపీఎస్‌లో పలు రకాల అడ్వాన్సులు తీసుకునే అవకాశం ఉంది. జీపీఎస్ అనేది అంకెలా గారడీ తప్ప ఏమీ లేదు.
- శ్రీనివాస్, తుని మండల యూటీఎఫ్ అధ్యక్షుడు

మాయమాటలు చెప్పి నమ్మించాలనుకున్నారు..



సీపీస్ రద్దుకు కేంద్రం ఒప్పుకోలేదని ప్రభుత్వం మాయ మాటలు చెప్పే ప్రయత్నం చేసింది. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేసుకోవడం రాష్ట్రాల స్వయం నిర్ణయాలకు వదిలేస్తున్నామని కేంద్రం కచ్చితంగా చెప్పడంతోనే పలు రాష్ట్రాలు ఈ దిశగా పనిచేస్తున్నాయి.
- తాజుద్దీన్, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి, కోటనందూరు, కాకినాడ జిల్లా

హామీలిస్తారు.. నెరవేర్చరంతే.



ఉద్యోగులతో జగన్ సెల్ఫీ (ఫైల్)



హామీలిస్తారు.. నెరవేర్చరంతే. జగన్ పాదయాత్రలో వైద్య ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు తెలుసుకుని మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హత ఉన్న ప్రతి ఒక్కరిని రెగ్యులరైజ్ చేస్తానని వేతనాలు పెంపుదల చేస్తానని మాట ఇచ్చారు.. అధికారంలోకి వచ్చాక జగన్ మొండి చూపించారు. వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్‌లో 186 కేటగిరీల్లో 22 వేల మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. కరోనా సమయంలో కూడా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సేవలందించారు. 11వ పీఆర్సీలో రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎంటీఎస్ అమలు చేస్తూ జీవో జారీ చేసింది. కాని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు మాత్రం ఎటువంటి పెంపుదల చేయలేదు. దీనిపై ఉద్యమిస్తే పోలీస్ స్టేషన్‌లో నిర్బందిం చారు.సీఎం జగన్ హామీ ఇచ్చినా మా సమస్యలు పరిష్కారం కాలేదు.
- దిద్దే దయామణి, కాంట్రాక్ట్ వైద్య ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు

అంగన్‌వాడీలకు హామీలిచ్చారంతే..



అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదు. చనిపోతే మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చినా జీవో విడుదల కాలేదు. రిటైర్మెంట్ బెనిఫిట్ కింద వర్కర్‌కిరూ.1.20 లక్షలు, హెల్పర్‌కు రూ.60 వేలు ఇస్తామన్నా జీవో విడుదల చేయలేదు.
కె.కృష్ణవేణి,అంగన్‌వాడీ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి, ముమ్మిడివరం

అంగన్వాడీలను మోసం చేసింది



అధికారంలోకి రాగానే తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనం చెల్లిస్తామని అంగన్వాడీలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. 11 డిమాండ్లకు ఆరే పరిష్కరించి మేజర్ డిమాండ్లను విస్మరించింది. 42 రోజులు నిరవధిక సమ్మె చేసినా ప్రభుత్వంలో చలనంలేదు.
బి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ సంఘ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు

43 రోజులు సమ్మె చేసినా పట్టించుకోలేదు..



పాదయాత్ర సమయంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను జగన్ నెరవేర్చ లేదు. వేతనాల పెంపు జరగలేదు. 43 రోజులు నిరవధిక సమ్మె చేసినా మా ప్రధాన డిమాండ్లకు ఇప్పటికీ మోక్షం కలగలేదు. సమ్మె కాలపు వేతనం తక్షణం చెల్లించాలి. **- డి.ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ అధ్యక్షురాలు, రాయవరం సెక్టారు**

కాంట్రాక్టు కార్మికులకు టైమ్ స్కేల్ ఇవ్వాలి..



పదేళ్లు పూర్తయిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి మినిమమ్ టైమ్ స్కేల్‌లోకి అమలు చేయాలి. హెల్త్‌స్కీంలు అమలు చేయాలి. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మరణిస్తే కుటుం బంలో కారుణ్య నియామక ఉద్యోగాన్ని కల్పించాలి. **- సూరిబాబు, రెవెన్యూ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సామర్లకోట**

మీరిచ్చే జీజీఎస్ మాకొద్దు..



సీపీఎస్ వారంలో రద్దు చేస్తానన్న జగన్.. లోపభూయిష్టమైన జీపీఎస్ తీసుకొచ్చారు. సమయానికి జీతాలు లేవు. సమస్యలపై పోరాడితే పోలీసులతో అణిచివేతకు గురిచేశారు. పీఎఫ్ లోన్లు, ఏపీజీ ఎల్ఐ క్లెయిమ్స్ ఎప్పుడు ఇస్తారో తెలియదు. కొత్త పీఆర్సీలో హెచ్ఆర్ఏ ఎలెవెన్స్ తగ్గించారు. **- సతీష్‌బాబు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పి.నాయకంపల్లి, గండేపల్లి**

జీతాలు పెంచుతానని ఆశ పెట్టారు..



ఆశా వర్కర్లకు జగన్ ప్రభుత్వం రూ.10వేలు పెంచుతానన్న హామీని పూర్తిగా నెరవేర్చలేదు. రూ.4 వేలు మాత్రమే పెంచారు. చంద్రబాబు హయాంలో ఆశావర్కర్ల జీతాలు రూ.6వేలు ఉండగా జగన్ ప్రభుత్వంలో రూ.10వేలు చేశారు. ఆశావర్కర్ల జీతాలు పెంపుదల చేయాలి.
- వెంకటలక్ష్మి, ఆశావర్కర్, ధర్మవరం, ప్రత్తిపాడు మండలం



మళ్లీ మరమ్మతులకు గురైన గామన్ బ్రిడ్జి

మరోసారి సాంకేతిక లోపం.. నెల రోజుల్లో రెండో సారి

నేటి నుంచి పది రోజుల పాటు ఒక వైపే రాకపోకలు

కొవ్వూరు, ఏప్రిల్ 25: రాజమహేంద్రవరం-కొవ్వూరు మధ్య ఎక్స్‌ప్రెస్ హైవేకు అనుసంధానంగా ఉన్న గామన్ బ్రిడ్జి నెల రోజుల వ్యవధిలో మరోసారి మరమ్మతులకు గురైంది. మార్చి 24న గామన్‌బ్రిడ్జి 52వ స్తంభం వద్ద వంతెనకు యాక్షన్ ఇచ్చే బాల్ మరమ్మతులకు గురి కావడంతో వంతెనపై ఒకవైపు రాకపోకలను నిలుపుదల చేశారు. మరమ్మతులు పూర్తిచేసి సుమారు నెల రోజుల తరువాత ఏప్రిల్ 23న రెండువైపులా వాహన రాకపోకలను అనుమతించారు. అయితే ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే మార్గంలో 28వ స్తంభం వద్ద అమర్చిన బేరింగ్‌లో ఎటువంటి ప్రేజర్ రావడం లేదని గుర్తించారు. దీంతో ఈ నెల 26 నుంచి మే 3వ తేదీ వరకు ఈ మార్గంలో వాహన రాకపోకలను నిలుపుదల చేస్తున్నట్టు సమాచారం. బేరింగ్ మార్పు చేయడానికి 10 రోజుల పాటు వంతెనపై ఒక మార్గంలోనే వాహన రాకపోకలకు అనుమతించనున్నారు. ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానం లేని సమయంలో నిర్మించిన వంతెనలు వందేళ్లకు పైగా సేవలందించాయి. ఆధునిక సాంకేతికతతో నిర్మించిన గామన్ వంతెనపై రాకపోకలు ప్రారంభించిన పదేళ్లకే మరమ్మతులకు గురి కావడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో అధికార పార్టీ నాయకులు దోచుకున్నదే హద్దుగా నిబంధనలను తుంగలో తొక్కి వంతెనల చెంతనే ఇసుక డ్రెడ్జింగ్ చేసి గోదావరి నదిని గుల్ల చేశారు. గోదావరి తీరం వెంబడి ఏటిగట్టును కొల్లగొట్టి ఏర్పాటుచేసిన ఇసుక ర్యాంపులు, ఇసుక తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్, పోలీసు, ఎస్ఈబీ అధికారులు సైతం ఫిర్యాదుచేసిన వారిని, ఇసుక తవ్వకాలు, రవాణా అడ్డుకున్న వారిని అరెస్టులు చేశారు తప్ప ఇసుక అక్రమ తవ్వకాలు, అనధికార డ్రెడ్జింగ్‌ను అరికట్టలేకపోయారు. దీని పర్యవసానమే గామన్‌బ్రిడ్జి మరమ్మతులకు కారణమని గోదావరి జిల్లా వాసులు వాపోతున్నారు.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఘట్టం ముగిసింది.ఈ నెల 18న నామినేషన్ల స్వీకరణ మొదలైన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి గురువారం వరకూ మొత్తం ఏడు రోజుల పాటు జిల్లాలో పార్లమెంట్,ఏడు అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ల ఎన్నికల అధికారులు స్వీకరించారు. శుక్రవారం నామినేషన్లు పరిశీలిస్తారు.29వ తేదీన తుది జాబితా ప్రకటిస్తారు. మధ్యలో ఎవరైనా అప్పీల్ చేసుకోవచ్చు. తమ నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు.మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కోసం పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ఈ నెల 29వ తేదీ సాయంత్రం 3 గంటలకు ప్రకటిస్తారు. చివరిరోజైన గురువారం కూడా నామినేషన్లు జోరుగా దాఖలయ్యాయి. రాజమహేంద్రవరం పార్లమెంట్‌కు 7 నామినేషన్లు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు 65 నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత తెలిపారు.

● రాజమహేంద్రవరం పార్లమెంట్‌కు గురువారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా కొల్లపు వేణు, జల్లి బాల నవీన, గొలుగూరి వెంకటలక్ష్మి నారాయణరెడ్డి, ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ తరఫున చేబ్రోలు చైతన్యరిపబ్లిక్ ఆఫ్ ఇండియా తరఫున వారా ప్రభాకర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పులగం విజయభాస్కరలక్ష్మి, యుగ తులసీ పార్టీ తరఫున కోటగిరి శ్రీనివాసరావు తమ నామినేషన్లు దాఖలు చేశారు.

● అనపర్తి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తరఫున నల్లమల్లి మహాలక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు.ఇక స్వతంత్ర అభ్యర్థులుగా కొమ్మిరి శారమ్మ, పులగం సూర్యారెడ్డి, రేలంగి నాగేశ్వరరావు, రేలంగి ఆసుబాబు, పివివి సత్యనారాయణ, వి.అరవింద్, జైభారత్ పార్టీ తరఫున కారిదాస్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా కొమ్మన సత్య రూపస్వీ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున షేక్ సర్దార్ హుస్సేన్ నామినేషన్లు దాఖలు చేశారు.



అనపర్తిలో బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

● రాజానగరం నియోజకవర్గం నుంచి రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ తరఫున కొత్తపల్లి భాస్కరరామం, వైసీపీ తరఫున గంధం రాజేశ్వరి, నారం సూర్యలక్ష్మీ నారాయణ, స్వతంత్ర అభ్యర్థులుగా బర్రె ఆనంద కుమార్, బత్తుల బాలబ్రహ్మం, బత్తుల వందన అంబిక, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున ముండ్రు వెంకట శ్రీనివాస్, జై.భారత్ నేషనల్ పార్టీ తరఫున పొనగంట అప్పల సత్యనారాయణ, ఇండియన్ ప్రజాబంద్ పార్టీ తరఫున మద్దా వెంకట్రావు, బీఎస్పీ తరఫున నల్లమిల్లి రవికుమార్, జనసేన తరఫున దొడ్డా వెంకటేశ్వర్లు, భారతీయ చైతన్యపార్టీ తరఫున కట్టా కృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు.

● రాజమండ్రి అర్బన్ నుంచి వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ తరఫున మార్గాని సురేష్, పిరమిడ్ పార్టీ ఇండియా తరఫున యనమదల మోహన్‌బాబు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి బోడా వెంకటలక్ష్మి తరఫున శిఖా బాలాజీ, భారతీయ చైతన్యపార్టీ తరఫున వెలిగట్ల సుబ్రహ్మణ్యం, జైభారత్ నేషనల్ పార్టీ తరఫున బహదూర్‌షా కృష్ణచైతన్య నామినేషన్లు దాఖలు చేశారు.

● రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వైసీపీ అభ్యర్థిగా చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తరఫున గొందేశి శ్రీనివాసరెడ్డి, బీఎస్పీ తరఫున కొండపల్లి సూరిబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా బుద్దపు శివవిష్ణు ప్రసాదరావు, మనీల్ బుచ్చియ్య, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా బాలేపల్లి మురళీ,జైభారత్ పార్టీ తరఫున మన్నవ రఘురామ్, జైభీమ్‌రావు పార్టీ తరఫున గునిపే కిరణ్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు.

● కొవ్వూరు ఎస్సీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు తరఫున అనుపిండి చక్రధరరావు, తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ముప్పిడి సుజాత తరఫున ఈడూరి వెంకటరమణ మూర్తి, రాష్ట్రీ ప్రజా కాంగ్రెస్ తరఫున కొయ్య శేఖర్ బాబు, బీఎస్పీ తరఫున చొల్లా కుమారి, వైసీపీ తరఫున తలారి వరంజ్యోతి,నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున ముప్పిడి శేఖరబాబు నామినేషన్లు వేశారు.

● నిడదవోలు నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున గెడ్డం శ్రీనివాసనాయుడు, స్వతంత్ర అభ్యర్థులుగా కంచర్ల దుర్గేష్, గిద్దా శ్రీనివాసనాయుడు, గిద్దా వెంకటేశ్వరరావు, బీఎస్పీ తరఫున గుమ్మాపు చిత్రసేను, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున ముక్కామల అన్నవరపు ప్రసాద్, ఎస్‌జేఎస్‌పీ పార్టీ తరఫున కొట్టేయాల దుర్గా ప్రసాద్, ఐఎన్‌సీ తరఫున పెద్దిరెడ్డి సుబ్బారావు, ఏఐఎఫ్‌బి పార్టీ తరఫున కస్తూరి వీర ప్రసాద్ నామినేషన్లు దాఖలు చేశారు

● గోపాలపురం నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరఫున మద్దిపాటి వెంకట్రాజు, జైభారత్ పార్టీ తరఫున ములగాల శ్రీనివాసరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున షోడదాసి మార్టిన్ లూథర్, ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ తరఫున బాతుల వేణు, నవరంగ కాంగ్రెస్ పార్టీ తరఫున మద్దిపాటి వెంకటేశులు నామినేషన్లు దాఖలు చేశారు.

● చివరి రోజు రాజమండ్రి పార్లమెంట్‌కు 7, అనపర్తి అసెంబ్లీ స్థానానికి 17, రాజానగరం అసెంబ్లీకి 13, రాజమండ్రి సిటీకి 5, రాజమండ్రి రూరల్‌కు 8, కొవ్వూరు కు 8, నిడదవోలుకు 8, గోపాలపురం అసెంబ్లీకి 6 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం మొత్తం పార్లమెంట్‌కు ఏడు, అసెంబ్లీ స్థానాలు ఏడింటికి కలిపి 65నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా ఏడు రోజులు పార్లమెంట్‌కు 24 .. అసెంబ్లీకి 181 నామినేషన్లు దాఖలయ్యాయి.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

పోలీస్ అబ్జర్వర్ బలరామ్ మీనా

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా, ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి పోలీసులు సమష్టిగా సమన్వయంతో నిబద్ధతగా విధులు నిర్వర్తించాలని పోలీస్ అబ్జర్వర్ బలరామ్ మీనా పేర్కొన్నారు. జిల్లాలోని పోలీస్ అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన సమీక్షించారు.

ప్రజలకు అందుబాటులో ఎన్నికల పరిశీలకులు

ధవళేశ్వరం, ఏప్రిల్ 25: తూర్పుగోదావరి జిల్లాకు ఎన్నికల కమిషన్ నియమించినప్రత్యేకపరిశీలకులు ధవళేశ్వరం కాటన్ అతిథి గృహంలో బస చేసి తమ విధులు నిర్వహిస్తారని అలాగే నిర్ణీత సమయాల్లోప్రజలకు అందుబాటులో ఉంటారని కలెక్టర్ కె. మాధవీలత తెలిపారు.తమిళనాడుకు చెందిన ఐఏఎస్ అధికారి బాల సుబ్రహ్మణ్యం రాజమహేంద్రవరం పార్లమెంట్, రాజమహేంద్రవరంసిటీ, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం,అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా నియమితులయ్యారన్నారు. ఈయన 89779 35105 నెంబరక్‌లో సంప్రదించాలని సాయంత్రు 4నుంచి 5గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కమల్‌కాంత్ సరోచ్ కొవ్వూరు(ఎస్‌సీ), నిడదవోలు, గోపాలపురం(ఎస్సీ) నియోజకవర్గాల సాధారణ పరిశీలకులుగా నియమితులయ్యారని 89779 35105 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఉదయం 9 నుంచి 10గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారి జై.అరవింద్‌ను 89779 35073 ఫోన్ నెంబర్ ద్వారా,అసెంబ్లీ నియోజకవర్గ వ్యయపరిశీలనకు ఐఆర్ఎస్ అధికారి రోహిత్ నగర్‌ను 89779 35074ఫోన్ నెంబర్ ద్వారా, పోలీస్ పరిశీలకులు ఐపీఎస్ అధికారి బలరాం మీనాను 87126 02093 నెంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

పేదల సమస్యల పరిష్కారానికి కృషి

ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్



నిడదవోలులో ఎన్నికల ప్రచారంలో బట్టలు ఇస్త్రీ చేస్తున్న కందుల దుర్గేష్

నిడదవోలు, ఏప్రిల్ 25: పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం నిడదవోలులోని 7,9,10,11 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బటన్ నొక్కుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రభుత్వం నిజస్వరూపాన్ని ప్రజలు గ్రహించారని, ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేసేది కూటమి ప్రభుత్వమేనన్నారు. ఓటర్లు తనకు గాజు గ్లాసు గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైన, ఓటు వేసి విజయం అందించాలన్నారు. 9వ వార్డులో వైసీపీకి చెందిన ముస్లిం నాయకులు ఎండీ హైదర్, ఎస్ఏ రహీమ్, షేక్ కలీద్‌బాబు, షరీఫ్‌తోపాటు మాజీ కౌన్సిలర్ ఉసురుమర్తి సరస్వతి జనసేన పార్టీలో చేరారు. వారందరికీ దుర్గేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్లిం మైనార్టీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమాల్లో కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగా రమేష్, నిమ్మగడ్డ గోపాలకృష్ణ, ఎండీ అక్రమ్, ఎండీ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వో కార్యాలయం సందర్శన



ఆర్వో కార్యాలయాన్ని సందర్శించిన ఎన్నికల పరిశీలకుడు కమల్‌కాంత్

నిడదవోలు, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల్లోని ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ దాఖలు ప్రక్రియ పరిశీలించినట్టు పరిశీలకుడు కమల్‌కాంత్ సరోజ్ అన్నారు. గురువారం నిడదవోలులోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిడదవోలు అసెంబ్లీ పరిధిలో చెక్ పోస్టులను, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి రమణనాయక్ పాల్గొన్నారు

ఆఖరి రోజు 8 నామినేషన్లు



బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్‌ను అందజేస్తున్న కుమారి

కొవ్వూరు, ఏప్రిల్ 25: కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో గురువారం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 8 మంది నుంచి నామినేషన్లు స్వీకరించినట్టు సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. టీడీపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు తరపున 4వ సెట్ నామినేషన్‌ను అనుపిండి చక్రధరరావు, ముప్పిడి సుజాత తరపున 4వ సెట్ నామినేషన్‌ను ఈదూరి వెంకట రమణమూర్తి అందజేశారు. వైసీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు 4వ సెట్ నామినేషన్ అందజేయగా తలారి పరంజ్యోతి తరపున కొమ్మిరెడ్డి పరవురామారావు 2వ సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కొయ్యా శేఖర్‌బాబు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా చోళ్ల కుమారి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ముప్పిడి శేఖర్‌బాబు నామినేషన్ పత్రాలను అందజేశారు. స్వతంత్ర అభ్యర్థిగా ఆరుగొలను కమల 3వ సెట్ నామినేషన్‌ను అందజేసినట్టు ఆర్‌వో తెలిపారు.

గోపాలపురంలో 23 నామినేషన్లు

గోపాలపురం, ఏప్రిల్ 25: గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసిందని, మొత్తం 15మంది అభ్యర్థుల నుంచి 23 నామినేషన్ పత్రాలు అందాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివజ్యోతి తెలిపారు. రేపు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో నామినేషన్ పత్రాల స్క్రూట్నీ ప్రక్రియ జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోతో పేదలకు మేలు

కొవ్వూరు, ఏప్రిల్ 25: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలోని పథకాలన్నీ పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడతాయని కొవ్వూరు అభ్యర్థి అరిగెల అరుణకుమారి అన్నారు. గురువారం కొవ్వూరులోని ఇందిరమ్మకాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్న విషయం ఇప్పటికే ప్రజలకు అర్థమైందని, కాంగ్రెస్ మాత్రమే చెప్పింది చేస్తుందని నమ్ముతున్నారన్నారని ఆమె అన్నారు. కార్యక్రమంలో గెడ్డం సాయిబాబా, పాలకుర్తి ప్రభాకర్, నలమాటి లక్ష్మీనారాయణ, కొయ్య వెంకట్రావు పాల్గొన్నారు.

దేవరపల్లి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

దేవరపల్లి, ఏప్రిల్ 25: దేవరపల్లి నుంచి కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అభ్యర్థి మార్టిన్ లూథర్ నామినేషన్ కార్యక్రమానికి మోటార్‌సైకిళ్లు, కారుల్లో భారీ ర్యాలీగా గోపాలపురం వెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జ్యేష్ఠ సతీష్, కాకర్ల శ్రీహరిబాబు, వెలగా రామకృష్ణ, మటపర్తి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్‌పై కేసులు

గోపాలపురం, ఏప్రిల్ 25: మండలంలోని కరిచర్లగూడెం గ్రామంలో ఈ నెల 20న జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో 3వ క్లస్టర్ వలంటీర్ బత్తైన శ్రీను, 4వ క్లస్టర్ వలంటీర్ వేముల రమేష్, ఎండీయూ ఆపరేటర్ గారపాటి ధనరాజు పాల్గొని ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారు. దీనిపై ఎంపీడీవో ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

ఆవపాడులో యుద్ధప్రతిపాదికన విద్యుత్ పనులు

తాగునీటి మోటార్‌కు కనెక్షన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నల్లజర్ల, ఏప్రిల్ 25: మండలంలోని ఆవపాడులో విద్యుత్ శాఖాధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించి తాగునీటి మోటార్‌కు కనెక్షన్ ఇచ్చారు. విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల తాగునీటి సమస్య ఏర్పడిందని, ఆవపాడులో తీరని తాగునీటి సమస్య అనే శీర్షికపై బుధవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం విద్యుత్ శాఖ డీఈ వీరభద్రరావు ఆధ్వర్యంలో యుద్ధప్రతిపాదికన పనులు ప్రారంభించారు. మధ్యాహ్నం నుంచి పంచాయతీ మోటార్‌కు కనెక్షన్ ఇచ్చేందుకు చెట్లు నరికి, నూతనంగా విద్యుత్ లైన్ వేసి రాత్రి 7గంటలకు కనెక్షన్ ఇచ్చారు. తాగునీటి సమస్య పరిష్కరించడంతో గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ పనుల్లో ఏడీఏ ఎం.వర్మ, అనంతపల్లి ఏఈ బాపిరాజు, నల్లజర్ల ఏఈ నారాయణరావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు కోరుతున్నారు'

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25: తెలుగుదేశం పార్టీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. స్థానిక 36వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లజర్ల, ఏప్రిల్ 25: అనంతపల్లి సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ బాపిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు అనంతపల్లి, కృష్ణమ్మగూడెం, చోడవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే వ్యవసాయ విద్యుత్ తెల్లవారుజామున 3గంటలకు నుంచి ఉదయం 6గంటల వరకు, మధ్యాహ్నం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

గట్లుపై గ్రద్ధలు



చెరుకుమిల్లిలో పోలవరం కుడికాల్వపై సాగు చేస్తున్న పొగాకు తోట

- పోలవరం కాలువ గట్లను తవ్వేస్తున్న మాఫియా
- గట్లు మట్టి, ఇసుక అమ్మేసుకుంటున్న వైనం
- అడ్డూఅదుపు లేని అధికార పార్టీ నాయకులే దోపిడీ
- వరద ముంపుపై నియోజకవర్గ ప్రజల్లో ఆందోళన

గోపాలపురం, ఏప్రిల్ 25: గోపాలపురం నియోజకవర్గంలో పోలవరం కుడి ప్రధాన కాల్వ, తాడిపూడి ఎత్తిపోతల పథకం గట్టు ఉంటే ఒట్టు అనే పదానికి నిదర్శనం. నియోజకవర్గ ముఖ్యకేంద్రమైన గోపాలపురం మండలం చెరుకుమిల్లి గ్రామంలో వైసీపీ అధికారంలోకి రాక ముందు పోలవరం కుడి ప్రధాన కాల్వ గట్టు ఉండేది. ప్రస్తుతం ఈ గట్టు ఏమైందోనని ఆశ్చర్యం నెలకొంది. అధికార పార్టీకి చెందిన దళారులే గట్టు, మట్టి, ఇసుక అమ్మేసుకుని సొమ్ము చేసుకోవడానికి ఈ ప్రాంతాన్ని వ్యవసాయ భూమిగా మార్చి ఆ భూమిలో పొగాకు సాగు చేస్తున్నారు. చెరుకుమిల్లిలోనే కాదు నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల వరకు ఇదే తంతు. అధికార పార్టీ నాయకుల అక్రమాలకు అడ్డూఅదుపు ఉండడంలేదు. ఎవరు ఏమనుకుంటే తమకేంటి అధికారంలో ఉంది తామే, మరలా అధికారంలోకి వచ్చేది తామే, గట్టు కొల్లగొట్టేది తామేననే అంటూ పేట్రేగిపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. భవిష్యత్తులో ఈ గట్టులేకపోతే ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటి ప్రవాహానికి సమీప గ్రామాలు సైతం ముంపుకు గురవుతాయని, అధికార పార్టీ నాయకుల ఆగడాలకు హద్దు అంటూ లేకుండా పోతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రాజంపాలెం వద్ద దేవరకొండ అనధికారికంగా గ్రావెల్ తవ్వకాలు

కాకి పోయి రాబందు వచ్చినట్టు..

ఇక్కడ మట్టి, ఇసుక, కాల్వ గట్టు దోపిడీ కార్యకలాపాలతో అధికార పార్టీని ప్రజలు ఛీదరించుకుంటున్నారు. అయితే కాకిని తరిమి రాబందును రప్పించినట్టు అక్కడ నేరుగా ఇసుక దోపిడి చేసిన వ్యక్తే ఇక్కడ పోటీలో నిలపడడంతో ఓటర్లు విస్మయానికి గురవుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఓటు వేసేదిలేదంటూ తెగేసి చెబుతున్నారు. మరోసాకి వైసీపీకి ఓటు వేస్తే కాల్వగట్టు ఇక్కడ ఉండేదని చెప్పుకునే విధంగా నియోజకవర్గ స్వరూపం మారిపోతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హామీలు ఇవ్వడమే కానీ అమలు చేయడం అధికార పార్టీకి రాదంటున్నారు.

కనుమరుగవుతున్న దేవరకొండ

రాజంపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్.86లో 92ఎకరాల భూమి విస్తీర్ణంలో దేవరకొండ వ్యాపించి ఉంది. అయితే ఈ కొండ ప్రాంతంలో గ్రావెల్ పుష్కలంగా లభించడంతో అధికార పార్టీకి చెందిన సెకండ్ కేడర్ నాయకుడి అల్లుడు విచ్చలవిడిగా రేయింబవళ్లు గ్రావెల్‌ను ప్రొక్లెయినర్‌తో తవ్వి ట్రాక్టర్లపై తరలించి, అమ్ముకుని భారీగా సొమ్ముల కూడగట్టినట్టు విశ్వసనీయ సమాచారం. పంచాయతీ ఎన్నికల అనంతరం మొదలైన ఈ గ్రావెల్ దోపిడీని ఉన్నతాధికారులతోపాటు పాలకులెవ్వరు నిరోధించకపోవడంతో గ్రావెల్ దోపిడీకి అడ్డూఅదుపు లేకుండాపోయింది. చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునే చందంగా వైసీపీ పేరు చెప్పుకుని ఆ నాయకుడు చేసిన దోపిడీ అంతాయింతా కాదు. అయితే స్థానిక ఎస్ఐ ఇటీవల గ్రావెల్ తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక ప్రొక్లెయినర్‌ను సీజ్ చేయడం కొస మెరుపు.

గట్లును చదును చేసి సాగు



కాల్వగట్లపై ఉన్న మట్టిని చదును చేసి అక్కడ కొన్నేళ్లుగా సాగు చేస్తున్నా కాల్వకు సంబంధించిన అధికారులు పట్టించుకోరు. కాల్వ గట్టు కనుమరుగైతే సమీప గ్రామాలైన చెరుకుమిల్లి, వెంకటాయపాలెం, చిట్యాల ముంపు బారిన పడే ప్రమాదముంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

-పిల్లి వెంకటేశ్వరరావు, రైతు, చెరుకుమిల్లి.

కఠినంగా శిక్షించాలి



మట్టి మాఫియా ఆగడాలు చూస్తుంటే అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నట్టు ఉంది. కాల్వ గట్లపై ఉన్న చెట్లు కొట్టి తరలిస్తున్నా, గట్టు తవ్వి మట్టిని అమ్ముకుంటున్నా అధికారులకు పట్టడంలేదు. విధి నిర్వహనలో చిత్త శుద్ధి ఉంటే మట్టి తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తవ్వకాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలి.

-గన్నమని సత్యనారాయణ, రైతు దేవరపల్లి.

రాజమహేంద్రవరం అభివృద్ధికి అంకితం

- జనసేన-టీడీపీ-బీజేపీ ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి



కొవ్వూరు మండలంలో రోడ్‌షో నిర్వహిస్తున్న పురందేశ్వరి, ముప్పిడి

కొవ్వూరు/తాళ్లపూడి, ఏప్రిల్ 25: రాజమహేంద్రవరం పార్లమెంట్ అభివృద్ధికి అంకితమవుతానని బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు, కూటమి రాజమహేంద్రవరం పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)తో కలిసి ఆమె కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొవ్వూరు మండలం ఆరికిరేవులలో ప్రారంభమైన రోడ్ షో కుమారదేవం, చిడిపి గ్రామాల మీదుగా తాళ్లపూడి మండలం తాడిపూడి, రాగోలపల్లి, వేగేశ్వరపురం మీదుగా రావులపాడు, మలకపల్లి నుంచి ధర్మవరం, పెనకనమెట్ట గ్రామాల్లో పర్యటించారు. దారి పొడవునా వారికి మహిళలు హారతులిచ్చారు. పురందేశ్వరి మాట్లాడుతూ తన తండ్రి చూపిన బాటలో నడుస్తూ, ప్రజా సేవకు అంకితమవుతున్నానని, 14 ఏళ్లుగా అందరూ తన పట్ల చూపుతున్న ఆదరాభిమానాలు మరువలేనివన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఓటును ఎంపీ అభ్యర్థినైన తనకు కమలం గుర్తుపై, ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. కేంద్రం నుంచి కావలిసిన వనరులు తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో అల్లూరి విక్రమాదిత్య, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, టీవీ రామారావు, వట్టికూటి వెంకటేశ్వరరావు, పరిమి రాధ, కోడూరి లక్ష్మీనారాయణ, నాదెళ్ల శ్రీరామ్, తాడిమళ్ల విజయవాణి, మారిశెట్టి వెంకటేశ్వరరావు, సుంకర సత్తిబాబు, సూరపనేని చిన్ని, పాలడుగుల లక్ష్మణరావు, ఎంపీపీ కాకర్ల నారాయుడు పాల్గొన్నారు.

చాగల్లు: రాష్ట్ర భవిష్యత్ కోసం గాడి తప్పిన వ్యవస్థలను దారిలో పెట్టి ప్రజలకు మెరుగైన సంక్షేమం అందించేందుకు చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు అన్నారు. మీనానగంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావును, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందరేశ్వరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్, కొఠారి ఆశోక్‌బాబా, తాళ్ళూరి హరిశ్చంద్రప్రసాద్, దొంగ రామకృష్ణ, బెజవాడ రాజు, జొన్నకూటి వెంకాయమ్మ, ఊబా దుర్గ పాల్గొన్నారు.

గోపాలపురంలో కాంగ్రెస్‌కు భారీ ఓటింగ్!

- పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



గోపాలపురంలో ఆర్వో కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న రుద్రరాజు

గోపాలపురం, ఏప్రిల్ 25: గోపాలపురం గడ్డ కాంగ్రెస్ అడ్డ అనే విధంగా బైక్‌ర్యాలీ, కార్లతో తరలి వచ్చిన కాంగ్రెస్ అభిమానుల ఉత్సాహం చూస్తే పార్టీకి ఈ నియోజకవర్గంలో భారీ ఓటింగ్ నమోదయ్యేలా ఉందని పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. గోపాలపురం నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి మార్టిన్ లూథర్ తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివజ్యోతికి గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చారు. కార్యక్రమంలో రాజమండ్రి అర్బన్ అభ్యర్థి బోడా వెంకట్, కొవ్వూరు అభ్యర్థి అరుణకుమారి, జ్యేష్ఠ సతీష్‌బాబు, హరిబాబు, వీరగణేష్, సీపీఐ, సీపీఎం నాయకులతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీగా గిడుగును గెలిపించండి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25: రాజమహేంద్రవరం ఎంపీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమ నాయకుడు గిడుగు రుద్రరాజును, సిటీకి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న బోడా వెంకట్‌లను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. రాజమహేంద్రవరం జట్లు లేబరు యూనియన్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు అధ్యక్షతన కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన, బోడా వెంకట్ పాల్గొన్నారు. జరిగిన సమావేశంలో మధు మాట్లాడుతూ ఎంపీగా గిడుగు రుద్రరాజుకు, ఎమ్మెల్యేగా బోడా వెంకట్‌లకు హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా విభజించి కార్మిక చట్టాలకు తూట్లు పొడిచారని, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కి, యాజమాన్యాలకు కార్మికులను బానిసలుగా చేశారన్నారు.

దేవరపల్లిలో ఉచిత వైద్య శిబిరం

దేవరపల్లి, ఏప్రిల్ 25: గ్రామీణ ప్రాంతంలో రోగులకు ఉచిత వైద్యసర్వీసులు అందించడం ఎంతో ఆనందదాయకమని దేవరపల్లి మల్టీస్పెషాలిటీ వైద్యులు డాక్టర్ కే.సుమంత్ అన్నారు. గురువారం ఆసుపత్రి ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మండలం నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి కూడా వచ్చే రోగులకు తమ ఆసుపత్రి ఆవరణలో ప్రతీ రెండు నెలలకు ఒకరోజు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రశాంత్, బాలకృష్ణ, రఘువీర పాల్గొన్నారు.

దోమలతో మలేరియా వ్యాప్తి

- ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ప్రసాద్
- పలుచోట్ల ప్రపంచ మలేరియా నివారణా దినం



కానూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉండ్రాజవరం, ఏప్రిల్ 25: దోమలతో మలేరియా వ్యాప్తి చెందుతుందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణా దినం సందర్భంగా గురువారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీరు నిల్వ ఉండే చెరువులు, గుంతలు, తొట్టెల్లో దోమలు పుడతాయని వివరించారు. తణుకు మలేరియా సబ్‌యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గృహాలు చుట్టూ నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రుబ్బురోళ్లలోను, ఫ్రిజ్‌ల వెనుక తొట్టెల్లో నీరు లేకుండా ఉంటే దోమలు రావని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కెఎల్‌డీ కుమారి, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగమణి, ఏఎన్ఎమ్‌లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. పాలంగిలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఎండ తీవ్రత దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ కె.నాగరాజు, ఎమ్ఎల్‌హెచ్‌పీ కె.బులివెంకమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై ర్యాలీ

పెరవలి, ఏప్రిల్ 25: ప్రపంచ మలేరియా నివారణా దినం సందర్భంగా కానూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మలేరియా వ్యాప్తి, నివారణ మార్గాలను తెలిపారు. దోమలు వ్యాపించకుండా చుట్టు పక్కల మురుగునీరు, వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు హేమరాజు, సూపర్‌వైజర్లు సత్యేంద్రకుమార్, రాజ సులోచన, విజయలక్ష్మి, నాగేశ్వరరావు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టంతో విభేదించిన పిల్లల హక్కుల పరిరక్షణకు చర్యలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): చట్టంతో విభేదించిన పిల్లలతో నిబంధనల ప్రకారం నడుచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులతో ఆయన గురువారం సమావేశ మయ్యారు. చట్టంతో విభేదించిన పిల్లల హక్కులను పరిరక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు తదితరుల కర్తవ్యాల గురించి వివరించారు. అనంతరం పర్యవేక్షణ గృహాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. పర్యవేక్షణలో ఉన్న బాలలతో మాట్లాడారు. సంక్షేమానికి సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా డీఎల్ఎస్ఏకి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జేజేబీ ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ సి.రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సాధారణ పరిశీలకుడిని కలిసిన ఎస్పీ జగదీష్



దవళేశ్వరం, ఏప్రిల్ 25: ఎన్నికల సాధారణపరిశీలకులుగా నియమితులైన కమల కాంత్‌సరోజ్‌ను ఎస్పీ జగదీష్ కలిశారు. కాటన్ అతిథి గృహంలో బస చేసిన ఆయన్ను గురువారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే

ఉపేక్షించం: కలెక్టర్

- ఇరు పక్షాలపై బైండోవర్ కేసులు నమోదు
- లాకౌట్ ఎత్తివేసి కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి
- మిల్లు కార్యకలాపాలు యథాస్థితికి చేరాక డిమాండ్ల పరిష్కారం
- సమావేశంలో కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25: జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఎస్పీ జగదీష్ స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆంధ్రా పేపరు మిల్లు యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాజమండ్రి పేపరుమిల్లు కార్మిక, ఉద్యోగ సంఘాల తరఫున ఇప్పటి వరకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచామన్నారు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తక్షణమే ఇరు వర్గాలు భేషరతుగా వ్యవహరించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు యాజమాన్యం నుంచి కార్మికులకు ఎటువంటి మద్దతు, హామీ ఇవ్వలేదన్నారు. ఎన్నికల సందర్భంలో సమ్మె నిర్ణయం, యాజమాన్యం లాకౌట్ ప్రకటన నేపథ్యంలో బాధ్యులపై ఎన్నికల బైండోవర్ కేసులు నమోదుకు ఎస్పీకి ఆదేశాలు జారీ చేశామన్నారు. భేషరతుగా సమ్మె విరమణ లాక్‌డౌన్ ఎత్తివేత్తపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు ప్రతిఒక్కరూ సంతకాలు చేసి మాత్రమే వెళ్లాలని మాధవీలత తెలిపారు. 20-25 రోజుల్లో పేపరుమిల్లు కార్యకలాపాలు, ఉత్పత్తి యథాస్థితికి చేరుకున్న వెంటనే కార్మిక సంఘాలతో వారి డిమాండ్ల పరిష్కారం కోసం యాజమాన్యం భేషరతుగా చర్చలకు పిలిచి వారి తరపున అంగీకారం తెలియజేసే క్రమంలో నివేదిక అందజేయాలని ఆదేశించారు. అలాగే కార్మికులు కూడా కంపెనీ ఉత్పత్తి సాధారణ స్థాయికి చేరుకునేలా తోడ్పాటు అందించాలన్నారు. మిల్లుపై ప్రత్యక్షంగా ఆధారపడ్డ మూడు వేల కార్మికుల కుటుంబాలు, పరోక్షంగా మరింత మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమ అభివృద్ధి కూడా ముఖ్యమన్నారు. అనంతరం ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఏప్రిల్ 2 నుంచి సమ్మెకు వెళ్లడం శాంతిభద్రతల పరిరక్షణకు ఇబ్బందికరమని, ఇప్పటి వరకు కార్మికుల పక్షాన పోలీసులు, జిల్లా యంత్రాంగం నిలబడిందన్నారు. ప్రస్తుతం ఎన్నికల నేపథంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కఠినంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ఇప్పటికే పలుమార్లు సంప్రదింపులు జరిపి వారి న్యాయమైన డిమాండ్స్ అమలు చేసేలా మద్దతుగా నిలిచిన విషయం ప్రస్తావించారు. మిల్లు యాజమాన్యం లాకౌట్‌ను ఎత్తివేయాలని, కార్మికులు విధులకు హాజరు కావాలన్నారు. కార్మికులు విధులకు వెళ్లే క్రమంలో ఎటువంటి చర్యలు తీసుకోరాదని స్పష్టం చేశారు. జాయింట్ కార్మిక కమిషనర్ ఎ.రాణి మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధి ద్వారా సమాజ నిర్మాణానికి, ఉపాధి కల్పనకు అవకాశాలు పెరుగుతాయన్నారు. పేపరుమిల్లు ఉత్పత్తి యథాస్థితికి చేరుకున్నాక కార్మికుల డిమాండ్లపై చర్చలకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులు సమ్మె విరమించాలన్నారు. సమావేశంలో సహాయ లేబర్ కమిషనర్ ఏఎస్ఎల్ వల్లీ, డీఎస్పీ రామకృష్ణ, యాజమాన్య ప్రతినిధులు వి.శ్రీనివాస్, జి.గణేష్, ఎస్.విజయకుమార్, కార్మిక సంఘం ప్రతినిధులు సీఐటీయూ నాయకులు టి.అరుణ్, ఎస్.వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకుడు ఎ.సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ నాయకుడు జేవై దాసు, స్టాఫ్ వర్కర్స్ సంఘం కె.రాజేష్, బి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న పేపరుమిల్లు.. కలెక్టర్, ఎస్పీ, లేబర్ కమిషనర్ల సమక్షంలో జరిగిన సమావేశంలో మిల్లు కార్మికులు, యాజమాన్య ప్రతినిధుల మధ్య సయోధ్య కుదరడంతో గురువారం రాత్రి 10గంటల నుంచి మిల్లు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. కార్మిక సంఘాల నాయకులు, మిల్లు యాజమాన్య ప్రతినిధులు జిల్లా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

భారీ అన్నసమారాధన

దేవరపల్లి, ఏప్రిల్ 25: దేవరపల్లిలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన జరిపారు. దుద్దుకూరు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.